S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 49 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 28 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## ఇమ్రాన్‌ఖాన్ క్షేమం

- మృతి వార్తలను ఖండించిన పాక్ జైలు అధికారులు

04

## ఎస్సీ, ఎస్టీల మాదిరి దివ్యాంగులకు రక్షణ

- కఠిన చట్టాలు అవసరమన్న సుప్రీం ధర్మాసనం



02



# రాష్ట్ర అభివృద్ధి ప్రతిబింబించేలా

## తెలంగాణ రైజింగ్-2047 పాలసీ

- ఆర్థికాభివృద్ధిని 3 రీజియన్లుగా విభజించాలి
- భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయాలి
- గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ సమీక్ష
- పాలసీ డాక్యుమెంట్‌పై భేటీలో చర్చ



**హైదరాబాద్, నవంబర్27:** రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్‌లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని 3 రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా విభజించుకోవాలని సూచించారు. ఈ మూడు రీజియన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయాలో డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌పై రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగా అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్ధే లక్ష్యంగా రానున్న 22 ఏళ్లకు భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చెప్పారు. వైద్యం, విద్య, టెక్నాలజీ, జీసీసీలు, ఫార్మా, అగ్రికల్చర్‌తో

మిగతా 2 లో

# యువత వల్లే స్టార్టప్ విప్లవం

## ప్రపంచానికే ఆదర్శం మన యువత
## దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు
## మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
## ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు



**న్యూఢిల్లీ :** భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను

మిగతా 5 లో

## ఎన్‌బీడబ్ల్యూ జారీ చేస్తాం



02

- బతుకమ్మకుంట కేసులో కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం
- హైడ్రా చీఫ్‌కు హైకోర్టు హెచ్చరిక
- డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం



## 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

- సింగిల్ బెంచ్ ఉత్తర్వులు కొట్టివేత
- ఉత్తర్వులను సస్పెండ్ చేసిన ధర్మాసనం
- తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా

02

## సిగాచీ ఫార్మా పేలుడు చిన్నదా?



పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం

2



# అమరావతి ఎదగాలంటే విస్తరణ తప్పనిసరి

- క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించాలి
- దేవతల రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతా
- రైతులతో భేటీలో సీఎం చంద్రబాబు

**అమరావతి :** కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం అమరావతి పర్యటన ఉన్నందున క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించేలా కేంద్రాన్ని కోరాలని రైతులు సీఎం చంద్రబాబును కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారు. రాజధాని అమరావతి రైతులతో సచివాలయం 5వ బ్లాక్ కాన్ఫెరెన్స్ హాల్‌లో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రైతుల సమస్యలపై కేంద్ర

మిగతా 5 లో


## రైతులు ఎట్టిపరిస్థితులలో నష్టపోకూడదు

అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు

5

## శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

- తుఫాన్‌కు దిత్వాహ్‌గా నామకరణం
- మత్స్యకారులను అప్రమత్తం చేసిన అధికారులు
- ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక



.. వివరాలు 3లో

## ఆర్టీసీ బస్సులో నాటుబాంబులు

బస్సులో 1000 నాటుబాంబుల రవాణా

.. వివరాలు 3లో



# ధాన్యం కొనుగోలు వేగవంతం

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు
## 8.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
## వినియోగదారుల వ్యవహారా శాఖ మంత్రి నాదెండ్ల

**అమరావతి :** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. గురువారం విజయవాడలోని

మిగతా 5 లో

## అబద్ధాలకు అంబాసిడర్ కేటీఆర్

- అసత్య ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం
- బీసీ రిజర్వేషన్లపై చేస్తున్న వ్యాఖ్యలు సత్యదూరం
- కేటీఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన మంత్రి సీతక్క

3





# ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

**డ్రగ్ కార్టెల్‌లో ఉన్న 50మంది నైజీరియన్ల అరెస్ట్**

**హైదరాబాద్, నవంబర్ 27:** దేశరాజధాని ఢిల్లీ తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టి డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్న 50మంది నైజీరియన్లను పట్టుకుంది. వీరంతా వీసా గడువు ముగిసినా మనదేశంలో తిష్టవేసి కూర్చుకున్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తున్న ఈగల్ పోలీసులు ఈ భారీ ఆపరేషన్లు పూర్తి చేశారు. ఢిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఢిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగిల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# సిగాచీ ఘటన చిన్నదా?

**54 మంది చనిపోయిన ఘటన చిన్నదేమీ కాదు**

**పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం**

**డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం**

**హైదరాబాద్, నవంబర్ 27:** సిగాచీ ఫార్మా పరిశ్రమలో 54 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న పేలుడు ఘటనలో పోలీసు దర్యాప్తు తీరును తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇంత పెద్ద దుర్ఘటన జరిగి నెలలు గడుస్తున్నా దర్యాప్తు పూర్తి కాకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది సాధారణ ప్రమాదం కాదని, ఇంతటి ఘోరంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పడం దారుణమని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇప్పటికే 237 మంది సాక్షులను విచారించినా పురోగతి ఏది? పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు?" అని నిలదీసింది. ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయకపోగా, కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత లోపించరాదని, వేగంగా పూర్తి చేసి బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

# కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

**ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ ● 2 గంటల పాటు కొనసాగిన విచారణ**

**హైదరాబాద్, నవంబర్ 27:** తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్‌డీ) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయగా, కీలక నిందితుడిగా ఉన్న మాజీ అధికారి రాధాకిషన్ రావును అరెస్టు చేశారు. 'బీఆర్ఎస్ సుప్రీం' ఆదేశాల మేరకే తాము పనిచేశామని రాధాకిషన్ రావు తన రిమాండ్ రిపోర్టులో పేర్కొనడం సంచలనం రేపింది. ఈ క్రమంలోనే కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన రాజశేఖర్ రెడ్డిని విచారించడం ద్వారా మరిన్ని వివరాలు రాబట్టాలని సిట్ భావిస్తోంది. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తులను కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ దర్యాప్తు ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# మరో గ్రామం ఏకగ్రీవం

**ఆదిలాబాద్ జిల్లా తేజాపూర్ ఏకగ్రీవానికి అంగీకారం**

**ఆదిలాబాద్, నవంబర్ 27:** తెలంగాణ పల్లెల్లో ప్రజాస్వామ్య ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియ అధికారికంగా ప్రారంభం కావడంతో రాష్ట్రం మొత్తం ఎన్నికల వాతావరణం లోకి ప్రవేశించింది. దీనితో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ పక్రియ ప్రారంభమయ్యింది. నామినేషన్ రోజు మరో సర్పంచ్ ఏకగ్రీవమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేజపూర్ గ్రామపంచాయతీకి పరిధిలోని సాలెగుడా, డోబ్బిగూడ , తేజపూర్ గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో సమావేశమై స్వచ్ఛందంగా ఎన్నికలు నిర్వహించకుండా కోవా రాజేశ్వర్‌ను సర్పంచ్‌గా మరో 8 మంది వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. మరోవైపు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది. రుద్రంగి మండలంలోని రూపులా తండాలో సర్పంచ్ పదవికి జవహర్ లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎన్నికల పక్రియ ప్రారంభమైన వెంటనే ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు కలిసి మద్దతు తెలపడంతో పోటీ అవసరమే లేకుండా పోయింది. జవహర్ లాల్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికైన వెంటనే తండా అంతటా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు.

# అభివృద్ధి ప్రతిబింబించేలా డాక్యుమెంట్

మొదటి పేజీ తరువాయి



పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (ఏఐ), స్టార్టప్, ఎంఎస్ఎంఈలు, టూరిజం, ఎగుమతులు వంటి రంగాలు రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలక రంగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సులభతర అనుమతులు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు రాష్ట్రాన్ని పెట్టుబడిదారుల మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయన్నారు. ఈ బలాలే పునాదిగా మరింత పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండాలని సీఎం సూచించారు. మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్‌లో 2,959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావడంతో పాటు.. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన రోడ్లు, సౌర విద్యుత్ వెలుగులతో విలేజ్ 2.0 లక్ష్యంతో పనిచేసేలా ప్రణాళిక చేసినట్లు అధికారులు వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు, హై-స్పీడ్ మొబిలిటీ కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్, నాలుగు ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లు, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును డాక్యుమెంట్‌లో వివరించనున్నట్లు తెలిపారు.

# కుంభకోణానికి ఆస్కారమే లేదు

మొదటి పేజీ తరువాయి



మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రీయల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రీయల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# పంచాయితీ ఎన్నికల లీగల్ సెల్ ఏర్పాటు


**హైదరాబాద్,నవంబర్27:** పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ లీగల్ సెల్‌ను ముగ్గురు సూపరిండెంట్ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఎన్నికల్లో రిజర్వేషన్లను సవాలు చేస్తూ కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికలు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తిచేసే విధంగా, ఎన్నికల పక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా జిల్లాలతో లీగల్ సెల్ సమన్వయం చేయనుంది. కేసులకు సంబంధించిన వివరాలు, సూచనలను 24 గంటల్లోపుగా అదనపు అడ్వొకేట్ జనరల్, గవర్నమెంట్ ప్లీడర్‌కి నివేదించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్నికల ప్రక్రియ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటూ కోర్టు కేసులు ఎన్నికలను ప్రభావితం చేయకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక సెల్ అన్ని జిల్లాలను సమన్వయం చేస్తుంది.

# గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

**హైదరాబాద్, నవంబర్ 27:** 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సీజే ధర్మాసనం జారీ చేసింది. 2015 గ్రూప్-2 నియామకాలు రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పును ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును పిటిషనర్? డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది.గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సీజే ధర్మాసనం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. 2019 అక్టోబర్ 24న చేపట్టిన గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ 2 జవాబు పత్రాల్లో వైట్ నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ చేసిన పార్ట్ బీ పత్రాలను మూల్యాంకనం చేయడం చెల్లదని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్యాంపరింగ్ జరిగినట్లు స్పష్టంగా కనిపించినప్పటికీ వాటిని పక్కన పెట్టకుండా మూల్యాంకనం చేయడం చెల్లదని స్పష్టం చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా చేసిన మూల్యాంకనం ఆధారంగా చేపట్టిన నియామకాలు చెల్లవని రద్దు చేస్తూ మరోసారి మూల్యాంకనం చేసి అర్హుల జాబితాను విడుదల చేయాలని జస్టిస్ నగేశ్ బీమపాక ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా 8 వారాల్లో ముగియాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ అప్పీలు దాఖలు చేశారు. కాగా ఈ అప్పీలు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు సరిగ్గా లేవని దీనివల్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తుందని వాదించారు. డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అన్నీ పరిగణలోకి తీసుకొని టీజీపీఎస్సీ నియామక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అప్పీలుపై వాదనలు విన్న సీజే ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ జారీ చేశారు. 2016లో మరికొన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చారు. వివిధ కేటగిరీల కింద మొత్తం 1,032 పోస్టులకు 2016 నవంబరులో పరీక్షలు నిర్వహించారు. కొంత మంది అభ్యర్థులు వైట్?నర్ ఉపయోగించారని మరికొంత డబుల్ బబ్లింగ్ చేశారని 2017లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. సాంకేతిక కమిటీ హైకోర్టుకు కొన్ని సూచనలు సమర్పించింది. దాని ప్రకారం ఓఎంఆర్ షీట్ లోని పార్ట్ ఏ లో వ్యక్తిగత వివరాలు, బుక్ లెట్ నెంబరుకు సంబంధించి చెరిపివేతలున్నా సమస్య కాదని తెలిపింది.పార్ట్ బీలో 150 ప్రశ్నల విషయంలో వైట్?నర్ వాడినట్లు గుర్తిస్తే ఆ జవాబులను పరిగణలోకి తీసుకోవద్దని సాంకేతిక కమిటీ సూచించింది. దీని ఆధారంగా మూల్యాంకనం చేసి 2019 అక్టోబరులో అర్హుల జాబితా ప్రకటించి నియామకపత్రాలిచ్చారు. ట్యాంపరింగ్ జరిగినా మూల్యాంకనం చేసి అర్హులను ఎంపిక చేశారంటూ మళ్లీ 6 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై సుదీర్ఘ విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ బీమపాక నియామకాలు రద్దు చేస్తూ ఈనెల 17వ తేదీన తీర్పు వెలువరించారు.

# నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం

- బతుకమ్మకుంట కేసులో కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం
- హైడ్రా చీఫ్‌రంగనాథ్‌కు హైకోర్టు హెచ్చరిక
- డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం




**హైదరాబాద్, నవంబర్ 27:** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే ఇప్పటికే ఇక్కడ సుందరీకరణ పనులు సాగాయి. పూర్వవైభవం తీసుకుని వచ్చారు. ఇటీవల సిఎం రేవంత్ తదితరులు కలిసి ప్రారంభించారు.

# నల్లచెరువులో ఆక్రమణలను మేం తొలగించలేదు

**తొలగింపులపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా**

**హైదరాబాద్, నవంబర్ 27:** కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద బుధవారం తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం... చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 176లో చెత్త సేకరించేవారు, స్క్రాప్ వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. చెరువు ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వారిని కోరగా, రెండు మూడు రోజుల క్రితమే వారు స్వచ్ఛందంగా తమ షెడ్లను తొలగించుకుని వెళ్లిపోయారు. అయితే, ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కొందరు కబ్జాదారులు.. సర్వే నంబర్ 180 పేరుతో ఇప్పుడు కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్నవారి నుంచి అద్దెలు వసూలు చేసిన వారే, ఇప్పుడు వారిని అడ్డం పెట్టుకుని భూమిని కొట్టేయాలని చూస్తున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించి, సర్వే నంబర్ 180 కింద తమకు నష్టపరిహారం కావాలని కోరారు. అయితే, తాము ఖాళీ చేయిస్తున్నది సర్వే నంబర్ 176 అని, చెరువులో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని హైడ్రా కోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. సర్వే నంబర్లను సరిచూసి, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. అసలైన నివాసితులు వెళ్లిపోయిన తర్వాత, కబ్జాదారులు చేస్తున్న చివరి ప్రయత్నమే ఈ గందరగోళమని హైడ్రా స్పష్టం చేసింది.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- మళ్లీ గెలుస్తాం.. కేసీఆర్‌ను సీఎంను చేస్తాం
- అసలు యుద్ధం 2028లో ఉంటుంది
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్ 27:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం.. అధికారంలోకి వస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్దాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

# అబద్ధాలకు అంబాసిడర్ కేటీఆర్

- అసత్య ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం
- బీసీ రిజర్వేషన్ల వ్యాఖ్యలు సత్యదూరం
- కేటీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన సీతక్క



**హైదరాబాద్, నవంబర్ 27:** స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండరాదని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీం కోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందు కోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# ప్రశాంతంగా పంచాయితీ ఎన్నికల నిర్వహణ

**పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం**

**పోలీస్ అధికారులతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్**




**హైదరాబాద్, నవంబర్ 27:** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం అత్యున్నత ధర్మం

**ఏఎస్‌జీ నరసింహ శర్మ**

**హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్):** భారత ప్రాచీన రాజధర్మ సూత్రాలే పునాదిగా ఉన్న మన రాజ్యాంగం అత్యున్నత ధర్మమని తెలంగాణ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బీ నరసింహ శర్మ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీలు గురువారం సంయుక్తంగా నిర్వహించిన 'ఫొటో ఎగ్జిబిషన్'ను సీబీసీ, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్‌తో కలిసి ఆయన సందర్శించారు. రాజ్యాంగ దినోత్సవం, వందేమాతరంఏ150 సమాచార స్టాళ్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత ప్రాచీన రాజధర్మ సూత్రాలే పునాదిగా ఉన్న మన రాజ్యాంగం అత్యున్నత ధర్మం అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ప్రవేశికను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, జాతీయ సమగ్రతను కాపాడాలని, రాజ్యాంగ నిర్మాతలు అందించిన ఫలాలను గుర్తుంచుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. విధులతో పాటే హక్కులు లభిస్తాయని గుర్తు చేస్తూ... రాజ్యాంగ విలువలను సామాన్య ప్రజలకు చేరవేయాలని ఆయన యువతకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో మాటామంతీలో భాగంగా చట్టం, రాజ్యాంగ సంబంధిత అంశాలపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అదనపు సొలిసిటర్ జనరల్ సమాధానమిచ్చారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శన బుధవారం ప్రారంభమవగా... ఈ నెల 30 వరకు అందుబాటులో ఉంటుంది.




Reg.No. H-9/2014
TUWJ
Telangana State
Union of Working Journalists

# 3న జర్నలిస్టుల మహా ధర్నా

**హైదరాబాద్, నవంబర్ 27:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నదని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ గురువారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందాలు గత రెండేళ్ల కాలంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అనేక దఫాలు కలిసి జర్నలిస్టుల సమస్యలపై, సంక్షేమంపైన విజ్ఞాపన పత్రాలు సమర్పించిన, కలిసిన ప్రతిసారీ మంత్రి స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చకపోవడం విచారకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి పట్ల మాసాబ్ ట్యాంక్, హైద్రాబాద్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద డిసెంబర్ 3న ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించాలని టియుడబ్ల్యూజే నిర్ణయించడం జరిగిందన్నారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి జర్నలిస్టులు పాల్గొనాలని కోరారు.

# బీఆర్ఎస్, బీజేపీ బీసీ ద్రోహులు

**మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్**




**హైదరాబాద్,నవంబర్27:** బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడేది తాము మాత్రమేనని, ఇతర పార్టీలు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు.. బీఆర్ఎస్, బీజేపీ. బలహీనవర్గాల ద్రోహులు అని మండిపడ్డారు.. గతంలో ఇతర రాష్టాల్లోన్రూ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ, ఈ పరిమితిని అధిగమించేందుకు ప్రభుత్వం సేకరించిన డాటా, నివేదికలు ఆధారంగా కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. అసలు బసి కోటాపై కోర్టులో ఇంప్లీడ్ ఎందుకు కాలేదు? అని పొన్నం ప్రశ్నించారు.. సిగ్గులేకుండా బయట విమర్శలు చేసే బీఆర్ఎస్ నాయకులు కోర్టులో మాత్రం లేరు అని మంత్రి ఆరోపించారు. కోర్టులో రిజర్వేషన్ నిలిపేస్తే బీఆర్ఎస్ నేతలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. అటు.. బీసీ రిజర్వేషన్ల అమలులో అడ్డంకులు తొలగించేందుకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న నిధులు ఇప్పించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నం చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు 42? రిజర్వేషన్లతోనే జరపాలన్న ఆలోచన ఉందని తెలిపారు పొన్నం.. ఇక బీసీ సర్వేలో పాల్గొనని పార్టీలకు మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నం తీవ్రంగా హెచ్చరించారు. కేంద్రంలో మా ప్రభుత్వం ఉంటే గంటల్లో బీసీ రిజర్వేషన్ అమలు అయ్యేదన్న ఆయన.. మేము కోర్టులో చేస్తున్న పని మీకూ తెలుసు. తెలిసీ మాపై ఆరోపణలు చేయొద్దు. సలహాలు ఇవ్వండి.. తీసుకుంటాం.. కానీ, రాజకీయ పార్టీల ఒత్తిడికి లోనవ్వొద్దు అని సచించారు.. బీజేపీ?బీఆర్ఎస్ బీసీ ద్రోహులు అని మండిపడ్డారు పొన్నం.. బలహీన వర్గాల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అన్యాయం చేశాయని తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం ఏం చెబుతుందో తెలియకపోతే తెలుసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో వారికి హక్కుగా రిజర్వేషన్ ఇవ్వాలి.. బీసీ సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం అని వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన

**చట్టాలను బేఖాతరు చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. ■ ఆర్ఎస్ ప్రవీణ్**



**హైదరాబాద్,నవంబర్ 27 :** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ చట్టంలోని నిబంధనలను బేఖాతరు చేసి కాంగ్రెస్ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదని.. ప్రజా ప్రతీకార పాలన.. పోలీసు రాజ్యమని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్ తో కలిసి దక్కన్ సిమెంట్ యజమానులను గన్నుతో బెదిరిస్తే వారిని కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీపీకి లేఖ రాయగా రాత్రికి రాత్రే మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌లు టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి సురేఖ ఇంటికి పంపించిన విషయం వాస్తవం కాదా ఆయన ప్రశ్నించారు. అయినప్పటికీ సుమంత్‌ని అరెస్ట్ చేయలేదన్నారు. అలాంటప్పుడు చేయని నేరానికి అకారణంగా ఐదు రోజులు కర్ల రాజేశ్ పోలీసుల రిమాండ్‌లో ఉంటే ఈ నియోజకవర్గానికి బాధ్యత వహించే మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాయలేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని రాజేశ్‌ను పోలీసులు చిత్రహింసలు పెట్టారని అందువల్లే ఆయన మృతి చెందారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల ప్రాజెక్టును రాత్రికి రాత్రే రూ.50 కోట్లకు పెంచడం అవినీతి కాక మరేమిటన్నారు. ఏమాత్రం ప్రణాళిక లేకుండా కొడంగల్ నారాయణపేట ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించారని ఈ అంశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. రాజేశ్‌కు నేర చరిత్ర లేదని అతనొక్కడే కుటుంబానికి ఆధారమని, త్వరలో ఇల్లు నిర్మాణం చేయిస్తానని తెలిపారు. తన కుమారుడి ఆరోగ్యం బాగాలేదని రాజేశ్ తల్లి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తానని పోలీసుల ఎదుట నెత్తి నోరు బాదుకున్నప్పటికీ పోలీసులు వినలేదని, నాణ్యమైన వైద్యం అందించకుండా చంపారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను అప్రూవర్‌గా తీసుకుని కేసును విచారించాల్సింది పోయి ఏకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల సాక్షిగా దళితులను బాగా చూసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో వాగ్దానం చేయించి ఈరోజు ప్రాణాలు తీస్తున్నారన్నారు. బడుగు వర్గాల అధికారులపై ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తుంటే ఆ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు అడ్లూరి భట్టి, వివేక్, రాజనర్సింహ ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు.




## సంపాదకీయం

# రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు!

మరో తుఫాన్ ద్వితాహ్ దూసుకుని వస్తోంది. అంది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది. తుఫాన్లు వచ్చినప్పుడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్క రైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పుడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పుడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు. తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌతోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశు సంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# బంగాళాఖాతంలో మరో తుఫాన్

- తుఫాన్‌కు దిత్వాహ్‌గా నామకరణం
- శ్రీలంక తీరంలో బలపడుతున్న వాయుగుండం
- ఏపీలో వర్షాలు కురుస్తాయని హెచ్చరిక



**విశాఖపట్నం, నవంబర్ 27:** నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులు తోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను శ్రీలంక ట్రింకోమలీకి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.

# యువత వల్లే స్టార్టప్ విప్లవం

- ప్రపంచానికే ఆదర్శం మన యువత
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు
- మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు




**న్యూఢిల్లీ, నవంబర్ 27:** భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు

### రావల్పిండి జైలు అధికారుల వెల్లడి



**రావల్పిండి, నవంబర్ 27:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులపై రావల్పిండిలోని అడియాలా జైలు అధికారులు స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని గురువారం స్పష్టం చేశారు. ఆయన్ను జైలు నుంచి ఎక్కడికీ తరలించలేదని, ప్రస్తుతం తమ వద్దే ఉన్నారని తెలిపారు. జైలు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, "ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి తరలించారనే కథనాల్లో వాస్తవం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, అవసరమైన పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఈ వదంతులపై ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇమ్రాన్‌తో ఆయన కుటుంబ సభ్యుల భేటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గత కొన్ని వారాలుగా ఇమ్రాన్ సోదరీమణులను ఆయన్ను కలిసేందుకు అనుమతించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించకపోవడంతో ఇమ్రాన్ సోదరీమణులు అలీమా ఖాన్, నూరీన్ ఖాన్, ఉజ్మా ఖాన్ మంగళవారం అడియాలా జైలు బయట గంటల తరబడి నిరసన చేపట్టారు. "లోపల ఏం జరుగుతోందో ఎవరికి తెలుసు? బహుశా ఇమ్రాన్‌ను వేరే చోటుకు తరలించి ఉండవచ్చు. అందుకే మమ్మల్ని కలవనివ్వడం లేదు" అని అలీమా ఖాన్ అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో అరాచక పాలన నడుస్తోందని ఆమె విమర్శించారు. 2022లో అవిశ్వాస తీర్మానంతో అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్, అవినీతి, ఉగ్రవాదం వంటి పలు కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే.

# జవాబుదారీతనం తప్పనిసరి

### ఆన్‌లైన్ కంటెంట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, నవంబర్ 27:** సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు.

## ఎస్సీ, ఎస్టీల మాదిరి

# దివ్యాంగులకు రక్షణ

### కఠిన చట్టాలు అవసరమన్న సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ, నవంబర్ 27:** దివ్యాంగులకు కూడా రక్షణ కవచం ఉండాలని సు ప్రీం కోర్టు అభిప్రాయ పడింది. వారినికించపరిచే వారిపై చర్యలు తీసుకునేం దుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సు ప్రీం కోర్టుపేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు. రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు నేడు విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సుర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే.. ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని.. వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

# అమరావతి ఎదగాలంటే విస్తరణ తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లతో ప్రభుత్వం ఇప్పటికే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ త్రిసభ్య కమిటీ 3 సార్లు భేటీ అయ్యింది. అయితే ఇప్పుడు ఈ రైతుల సమావేశంలో సమస్యల పరిష్కారంపై మరింత స్పష్టత వచ్చింది. రైతులకు ప్లాట్లు కేటాయింపు, జరీబు భూములు, ఎసైన్డ్ భూములకు సంబంధించి సమావేశంలో చర్చ జరిగింది. ఇంకా పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రిసభ్య కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారు. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు అన్నారు. అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని అన్నారు. అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల నుంచి కూడా మద్దతు కావాలని సీఎం చంద్రబాబు కోరారు.రాజధానికి భూములు ఇచ్చిన రైతులుగా మీపై అభిమానం, కృతజ్ఞత ఉన్నాయని తెలిపారు. రాజధానికి వ్యతిరేకంగా కొందరు కావాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని రైతులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అసత్య పోస్టులను కట్టడి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అమరావతి ఉద్యమంలో భాగంగా అనేక జేఏసీలు వచ్చాయని, ఇప్పుడు రైతులంతా కలిసి అమరావతి డెవలప్‌మెంట్ అసోసియేషన్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఎం రాజధాని రైతులకు సూచించారు. అమరావతి రైతుల అభివృద్ధికి,



భవిష్యత్తుకు తాను పూర్తి కమిట్?మెంట్?తో ఉన్నానని అన్నారు.మీకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వెల్లడించారు. రైతులు కూడా తనకు పూర్తిగా సహకరించాలని కోరారు. రైతులు, జేఏసీ నేతలు సీఎం దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. బిల్డింగ్‌కి ఫ్లోర్ పర్సంటేజ్ ఎస్ఎఫ్ఐ పెంచాలని రైతులు కోరారు. విజయవాడ, గుంటూరు కంటే అమరావతిలో తక్కువ ఉందని రైతులు సీఎం దృష్టికి తెచ్చారు. కరకట్ట బలోపేతం చేయాలని రైతులు చెప్పగా అది ప్రభుత్వం బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. బ్యాంకు లోన్ల కోసం వెళ్తే 30 సంవత్సరాల డాక్యుమెంట్?లు అడుగుతున్నారని రైతులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లలో రాజధాని రైతులు సుదీర్ఘ పోరాటం చేశారు. వారికి ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి" అని పురపాలక, సీఆర్డీఏ శాఖలను ఆదేశించారు. రైతుల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు త్వరలోనే వారితో సమావేశం కావాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు, ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వం కోసం త్యాగాలు చేసిన రైతులకు అదే స్థాయిలో సహకారం అందించడం మన బాధ్యత అని అన్నారు. ఇంకా ఏమైనా అపరిష్కృత అంశాలు మిగిలి ఉంటే, వాటిని కేబినెట్ సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.అలాగే, అమరావతిలో నిలిచిపోయిన నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణాల వేగం, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అంతిమంగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, పురపాలక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులు ఎట్టిపరిస్థితులలో నష్టపోకూడదు

**రెండు రోజుల్లో ధాన్యం బకాయిలు చెల్లించండి**

**అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి :** రాష్ట్రంలో ఏ రైతు కూడా పండించిన పంటకు నష్టపోకూడదని, పంటలకు ధరలు తగ్గకుండా, కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్ల బకాయిలను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో 50.75 లక్షల టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు గానూ రూ. 13,451 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ, "చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుని రెండు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేయాలి. భారీ వర్షాలు పడతాయన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులకు తగినన్ని గోనె సంచులు అందించాలి," అని ఆదేశించారు.పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెచ్చిన కొత్త విధానాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు సీఎంకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నుంచే కేంద్ర టెక్స్‌టైల్స్ కార్యదర్శి నీలం రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. కొత్త నిబంధనల వల్ల రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వర్ష సూచన ఉన్నందున త్వరగా పరిష్కరించాలని కోరారు. పత్తి కొనుగోళ్ల సమస్యపై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, ఈ బాధ్యతలను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు అప్పగించాలని అధికారులకు సూచించారు. అరటి, జొన్న ధరల సమస్యల పరిష్కారానికి స్థానిక వ్యాపారులు, ఎగుమతిదారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు.

# నలుదిశలా తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాలి

**ప్రధాన ఆలయాల్లో తిరుమల తరహా విధానాలు**

**శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు..**

**టీటీడీపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి:** ప్రపంచం నలుచెరగులా తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్యాత్మికత, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, టీటీడీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో తిరుమల ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ప్రసాదాల తయారీకి సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, భక్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలని, టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు.తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానం చేసి, వాటిని ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలో అత్యుత్తమ నిర్వహణ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులను 'శ్రీవారి సేవకులు'గా ఆహ్వానించి, వారి సేవలను ఈ ఆసుపత్రుల ద్వారా భక్తులకు, ప్రజలకు అందించేలా అవకాశం కల్పించాలన్నారు. మందులను నేరుగా తయారీదారుల నుంచే కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను తక్షణమే ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. రాబోయే వైకుంఠ ఏకాదశికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులు అన్ని భాషల్లోనూ దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని, వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలన్నారు. తిరుమల కొండలపై జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దివ్య ఔషధవనం ఏర్పాటుతో పాటు వివిధ రకాల పుష్పజాతుల మొక్కలను నాటాలని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించ తలపెట్టిన 5,000 దేవాలయాల డిజైన్లను మార్చి, వాటిలో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నిర్మాణాలను టీటీడీ పాలకమండలి సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. కొత్త ఆలయాలతో పాటు రాష్ట్రంలోని పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ ఆలయాల నిర్మాణం జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. అసోంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి 10 ఎకరాలు కేటాయించారని తెలుపగా, మరింత స్థలం కోసం తాను స్వయంగా మాట్లాడతానని సీఎం బదులిచ్చారు. లడ్డూ నాణ్యత పెంచడంతో పాటు అన్నప్రసాదంలో వడ కూడా అందిస్తున్నామని, వంటశాలను ఆటోమేషన్ చేసి రోజుకు 2.75 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వెంకయ్య చౌదరి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను

**అమరావతిలో శ్రీవారి ఆలయ**

**విస్తరణ పనులకు శంకుస్థాపన**

**రూ.260 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి ప్రణాళిక**

**రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని**

**టీటీడీకి సీఎం ఆదేశం**

రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ.260 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ విస్తరణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ బృహత్తర కార్యాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ విస్తరణ పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ వంటి నిర్మాణాలు చేపడతారు. ఇక రెండో దశలో రూ.120 కోట్లతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, భారీ అన్నదాన సముదాయం, యాత్రికుల విశ్రాంతి భవనాలు, అర్చకులు-సిబ్బంది నివాస గృహాలు, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, కలియుగ దైవం వెంకటేశ్వరుని ఆశీస్సులతోనే రాజధానికి అమరావతి అని పేరు పెట్టామని గుర్తు చేశారు. "దేవతల రాజధాని అమరావతే మన రాజధానిగా ఉండాలని సంకల్పించాం. కృష్ణానది ఒడ్డున 25 ఎకరాల్లో 2019లోనే ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. కానీ గత ప్రభుత్వం విధ్వంసం తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని త్యాగం చేస్తే, వారికి గత ఐదేళ్లు నరకం చూపించారు. ఆ వెంకన్ననే నమ్ముకున్న రైతులు 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో పాదయాత్ర చేశారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు. తాను శ్రీవారికి పరమ భక్తుడినని, తమ ఇంటి దైవం ఆయనేనని చంద్రబాబు తెలిపారు. "మా ఇంటి నుంచి చూస్తే శేషాచల పర్వతం కనిపిస్తుంది. చిన్నప్పటి నుంచి స్వామిని చూస్తూ పెరిగాను. స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను, ఎవరినీ చేయనివ్వను. తప్పు చేస్తే ఆయనే ఈ జన్మలో శిక్షిస్తాడు. నాడు స్వామివారి సేవకు వెళ్తుంటే నక్సలైట్లు 23 క్లైమోర్ మైన్లు పేల్చినా, ఆ స్వామి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను" అని నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుడితే, తాను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని చేపడతామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. ముంబైలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయాన్ని నిర్మిస్తోందని ఉదహరించారు. భక్తులు కూడా ఆలయ నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా, సంపదతో వర్ధిల్లాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.




# ఆర్టీసీ బస్సులో నాటుబాంబులు

## బస్సులో 1000 నాటుబాంబుల రవాణా

**విజయనగరం :** అది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉండే బస్టాండ్. ఒక్కసారిగా భారీ శబ్దం. దట్టమైన పొగలు. కారణం, ఆర్టీసీ బస్సులో వచ్చిన ఓ పార్శిల్‌లో ఏకంగా 1000 నాటుబాంబులు ఉండటమే. అవును, మీరు విన్నది నిజమే. ఇటీవల పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన నాటుబాంబుల పేలుడు ఘటన, ఆర్టీసీ కార్గో సేవల్లోని భద్రతా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. బస్సులో వచ్చిన పార్శిల్‌ను దించే క్రమంలో జరిగిన ఈ పేలుడులో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అసలు ఆ మూటలో ఏముందో తెలియకుండానే బస్సులో ఎక్కించేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ప్రయాణికులను చేరవేయడంతో పాటు, అదనపు ఆదాయం కోసం ఆర్టీసీ 2017లో కార్గో (పార్శిల్) సేవలను ప్రారంభించింది. తక్కువ ధరకే వస్తువులను పంపించే వెసులుబాటు ఉండటంతో దీనికి మంచి ఆదరణ లభించింది. రోజురోజుకూ ఆదాయం రెట్టింపు అవుతోంది. విజయనగరం జోన్ పరిధిలోనే రోజుకు సుమారు 250 వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. దీని ద్వారా రోజుకు రూ.40 వేల వరకు, నెలకు రూ.12 లక్షల ఆదాయం సమకూరుతోంది. నిత్యం ఈ సేవలను ఆశ్రయించేవారు 40 మంది వరకు రెగ్యులర్ కస్టమర్లు ఉన్నారు. అయితే, ఆదాయంపై పెట్టిన శ్రద్ధ, భద్రతపై పెట్టకపోవడమే ఇప్పుడు కొంప ముంచుతోంది.ప్రస్తుతం ఆర్టీసీ కార్గో బుకింగ్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. బుకింగ్ కౌంటర్లలో స్కానర్ పరికరాలు లేవు. లోపల ఏ వస్తువు ఉందో సాంకేతికంగా గుర్తించే వ్యవస్థ లేదు. పార్శిల్ పైన ఒక పేరు రాసి ఉంటే, లోపల మరో వస్తువు ఉంటోంది. కేవలం బరువును మాత్రమే చూసి, డబ్బులు తీసుకుని రశీదు ఇచ్చేస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గంజాయి, గుట్కా, ఇప్పుడు ఏకంగా నాటుబాంబులు వంటి నిషేధిత వస్తువులను దర్జాగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు.ప్రైవేట్ కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఆర్టీసీలో ఛార్జీలు చాలా తక్కువ. పైగా ఆర్టీసీ బస్సులు మారుమూల గ్రామాల వరకు వెళ్తాయి. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ఏజెన్సీ సిబ్బందిలో తెలిసిన వారు ఉంటే చాలు, ఎలాంటి తనిఖీలు లేకుండానే అనుమానాస్పద వస్తువులను పంపించేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు మూట కట్టి తెచ్చిన వస్తువును యథాతథంగా బస్సు ఎక్కించేస్తున్నారు. అది ప్రయాణికుల పాలిట యమపాశంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, పర్యవేక్షణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. కార్గో విభాగానికి మూడు జిల్లాల పరిధిలో (విజయనగరం జోన్) కేవలం ఒక్కరే సూపర్‌వైజర్ ఉన్నారు. డిపోల పరిధిలో డిపో మేనేజర్లు (డీఎంలు) పర్యవేక్షించాల్సి ఉన్నా, పని ఒత్తిడి కారణంగా అది జరగడం లేదు. నిఘా కొరవడటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.ఈ పరిస్థితిపై విజయనగరం డిపో కమర్షియల్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ హెచ్. దివ్య స్పందించారు. స్కానర్లు వంటి ప్రత్యేక పరికరాలు కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. రూ.5 వేలు విలువ దాటిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లు అడుగుతున్నామని, ఇకపై అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.ఏది ఏమైనా, పార్వతీపురం ఘటన ఒక హెచ్చరిక మాత్రమే. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని, కార్గో కేంద్రాల్లో స్కానర్లు ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టకపోతే, సామాన్య ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం పొంచి ఉంది.

# ధాన్యం కొనుగోలు వేగవంతం

మొదటి పేజీ తరువాయి



సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 4 నుంచి 6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులు రూపాయి కూడా నష్టపోకుండా కల్లాల వద్దే ధాన్యం కొంటున్నామని స్పష్టం చేశారు. కొంతమంది నేతలు ధాన్యం కొనుగోళ్లపై అనవసరంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ చెల్లించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో ఒక్క కృష్ణా జిల్లాలోనే లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల్లోనూ లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడుతుంటే, వారి మనోధైర్యం దెబ్బతినేలా కొందరు విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ. 679.79 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటికే అంతకు రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు జరిపిందని పోల్చి చెప్పారు. రవాణా వ్యవస్థను కూడా పటిష్టం చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 455 లారీలు నమోదు కాగా, తమ ప్రభుత్వంలో ఇప్పుడు 2,715 లారీలు నమోదు చేసుకున్నాయని వివరించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో రవాణా వాహనాల బకాయిలు రూ. 9 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 7.53 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అదనంగా మరో లక్ష సంచులను సిద్ధం చేశామని చెప్పారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల ఆందోళనను గమనించి మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియను ముందే ప్రారంభించామన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం 30వ తేదీ తర్వాత కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాల నుంచి పంటను కాపాడేందుకు కౌలు రైతులకు టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యం కొనే ప్రయత్నం చేస్తారని, ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 మద్దతు ధర చెల్లిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

# రుద్రంగి ఎస్ ఎస్ టీ ఎలక్షన్ చెక్ పోస్ట్ ఇంచార్జి కలెక్టర్ తనిఖీ

- రుద్రంగి ఆర్ఓ కేంద్రం పరిశీలన
- అధికారులకు సూచనలు



**రుద్రంగి, నవంబర్ - 27( సమయం న్యూస్).:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులో రుద్రంగి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రతి వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం రుద్రంగి లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ పుష్ప లత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ప్రారంభం



**వికారాబాద్ నవంబర్27( సమయం న్యూస్).:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ ఆష్మిన్ బాషా గార్ల తో కలసి ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లో భాగంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. హెల్ప్ లైన్ సెంటర్ ను పరిశీలించారు.జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ టివి లో వివిధ ఛానల్స్ తో పాటు లోకల్ ఛానల్స్ నుపర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ మనోహర రాజు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ,డీపీఆర్ ఓ చెన్నమ్మ,, ఉద్యాన వన శాఖ అధికారి సత్తర్, ఇ డి ఎస్సి కార్పొరేషన్ బాబు మోసెస్ , జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం.



**లక్ష్మణచాంద నవంబర్27( సమయం న్యూస్).:** గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు, కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. పరిశీలకు మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ప్రారంభం



**మెదక్ నవంబర్27( సమయం న్యూస్).:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం మెదక్ జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ను డిపిఆర్ఓ తో కలిసి జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లో భాగంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, ప్రవీణ్, కార్యాలయ ఉద్యోగులు, ప్రవీణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు మక్తల్ లో పోలీసుల మాక్ డ్రిల్

- అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్
- ప్రజల భద్రత, తక్షణ స్పందన కోసం,
- మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహణ.



**మక్తల్,నవంబర్,27(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా:జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ మరియు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మక్తల్ పట్టణ కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మైదానంలోమక్తల్ పోలీసులు, ప్రత్యేక సాయుధ బలగాలు కలిసి విస్తృత స్థాయిలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది అని అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హూల్ హక్ తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, పోలీసు సిబ్బందికి మాబ్ కంట్రోల్‌లో అనుసరించాల్సిన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు, గందరగోళ లేదా అత్యవసర పరిస్థితులు నెలకొన్నప్పుడు తక్షణ స్పందన సామర్థ్యం, ప్రజల ప్రాణ రక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వబడిందని ఆయన పేర్కొన్నారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఫుట్ ఫార్మేషన్, టీమ్ కోఆర్డినేషన్,హెచ్చరిక విధానాలు,చట్టపరమైన చర్యల అమలు పద్ధతులు వంటి అంశాలను సిబ్బంది ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. ఈ శిక్షణ ద్వారా పోలీసులు అనూహ్య పరిస్థితుల్లో మరింత చాకచక్యంగా, సురక్షితంగా ఎలా స్పందించాలో అవగాహన పొందారని అదనపు ఎస్పీ తెలిపారు.ప్రజల భద్రత పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ప్రొఫెషనలిజం, సేవాభావంతో మాబ్ కంట్రోల్ నిర్వహించగలగాలి అని తెలిపారు. ఇలాంటి మాక్ డ్రిల్లులు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు స్మోక్ గన్స్, ఫైర్ ఇంజన్ ద్వారా మాబ్ పై ఎలా ఫైర్ చేయాలి, ఎలాంటి పరిస్థితుల్లో ఏ విధమైన ఫైర్ వాడాలి అనే అంశాలను లైవ్ గా డెమో చేసి చూపించారు. దీనితో పోలీసు సిబ్బంది అనుభవం మరింత పెరిగిందని అధికారులు తెలిపారు.ఈ మాక్ డ్రిల్‌లో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, ఎస్సైలు భాగ్యలక్ష్మి రెడ్డి, ఎస్ ఎం నవీద్, అశోక్ బాబు, రమేష్, రేవతి,ఆర్ ఎస్సై లు శివశంకర్, మద్దయ్య, కానిస్టేబుళ్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, నవంబర్ 27( సమయం న్యూస్).:** గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ నిజామాబాద్ జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలైన బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లితో పాటు నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ లోని నవీపేట మండలం పరిధిలోని 184 సర్పంచ్, 1642 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో నవీపేట మండలం అభంగపట్నం, రెంజల్ మండలం వీరన్నగుట్ట, ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామపత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# చెన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

- చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్



**పూడూర్ మండలం, నవంబర్,27(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ గురువారం వికారాబాద్ జిల్లా,పూడూర్ మండలం చెన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ పర్యటనలో భాగంగా, ఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణను, సిబ్బంది విధుల నిర్వహణను, రికార్డుల నిర్వహణను, అలాగే పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్ గదుల వంటి వివిధ విభాగాలను పరిశీలించారు. స్టేషన్ చరిత్ర, పరిధికి సంబంధించిన వివరాలను, గతంలో మరియు ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్యను, ప్రస్తుతం విచారణలో ఉన్న మరియు పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి గురించి స్టేషన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.ఫిర్యాదుదారులతో సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కేసుల విచారణలో నాణ్యత (%ుబ్ఖుశ్రీ్‌ఉఎ శీట ×అ-జవర్‌అస్త్రుఫ్‌ఆశీఅ%) పాటించి, నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలని ఆదేశించారు.ముఖ్యంగా పోక్సో (%ూజుూ%), ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, మహిళలు మరియు బాలికలకు సంబంధించిన కేసులు, ఇతర గ్రేవ్ (%+తీుజవ%) కేసులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలైన దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని శ్రీమతి స్నేహ మెహ్రా స్పష్టం చేశారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించి పెట్టుకోవాలని తెలిపారు. సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, విధుల్లో క్రమశిక్షణతో పాటు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చెన్గోముల్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిల్మ్‌నగర్‌లో మోడల్ ఫుట్‌పాత్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన జీహెచ్ఎంసీ

- రూ. కోటి 68 లక్షలతో 1.5 కిలో మీటర్ మేర పర్యావరణహిత ప్లాస్టిక్ పేవర్ బ్లాకులతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- ఫుట్‌పాత్‌ల కోసం ప్రత్యేక సోలార్ గ్రిడ్
- పాదచారుల భద్రతకు అధిక ప్రాధాన్యం. అంధులు,వృద్ధులకు సౌకర్యంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం



**హైదరాబాద్, నవంబర్ 27,( సమయం న్యూస్).:** పాదచారుల భద్రత, సౌకర్యం మెరుగుపరచడం,వీధిని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో మోడల్ ఫుట్‌పాత్ అభివృద్ధి పనులను ప్రారంభించింది.ఈ ప్రాజెక్ట్ సర్కిల్–18, ఖైరతాబాద్ జోన్ పరిధిలోని రామానాయుడు స్టూడియో – రోడ్ నెం. 79/82 జంక్షన్ నుండి జంక్షన్, ఫానల్, రోడ్ నెం. 82 వరకు పాదచారుల రద్దీ అధికంగా ఉండే 1500 మీటర్ల పొడవైన మార్గాన్ని కవర్ చేస్తుంది. ఇందులో ఎడమ వైపు 1000 మీటర్లు, కుడి వైపు 500 మీటర్లు అభివృద్ధికి ప్రణాళికలను జీహెచ్ఎంసీ రూపొంది ంచింది. ఇందుకోసం మొత్తం రూ. 1 కోటి 68 లక్షలు వెచ్చించనున్నారు. వచ్చే 4 నెలల్లోగా పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.పర్యావరణహిత ప్లాస్టిక్ పేవర్ బ్లాకులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఫుట్‌పాత్‌లో ప్లాస్టిక్ పేవర్ బ్లాకులను ఉపయోగించ బడుతోంది.

ఈ బ్లాకులు:65%–%70% పోస్ట్–కన్స్యూమర్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు అవుతాయి

35 కంప్రెషన్ బలం కలిగి ఉంటాయి 225 %ఎ ఐ 112 ఎ ఎ ఐ 50 ఎ% (జిగ్–జాగ్ ప్యాటర్న్) పరిమాణంలో ఉంటాయిసాధారణ కాంక్రీట్ పేవర్లకు సరిసమానమైన దృఢత్వాన్ని అందిస్తాయి

భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి పర్యావరణాన్ని కాపాడటానికి తోడ్పడతాయి

స్మార్ట్ ఫుట్‌పాత్ కోసం సోలార్ గ్రిడ్

ఫుట్‌పాత్ పైభాగంలో 10 సామర్థ్యం గల సోలార్ గ్రిడ్ ఏర్పాటు చేయనున్నారు.దీనిలో భాగంగా:

600% లేదా అంతకంటే పై రేటెడ్ సోలార్ మాడ్యూల్స్ గ్రిడ్–టైడ్ ఇన్వర్టర్ 8–%10 అడుగుల ఎత్తులో మౌంటింగ్ స్ట్రక్చర్

ఆటోమేటెడ్ మాడ్యూల్ క్లీనింగ్ సిస్టమ్

డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌లు, లైట్నింగ్ అరెస్టర్ % ఎర్తింగ్

అన్ని ఎలక్ట్రికల్ కనెక్షన్లు, ఇన్‌స్టాలేషన్ %ఆ% కమిషనింగ్

ఈ సోలార్ పందిరి ( రూఫ్ టాప్ ) పాదచారుల భద్రతను పెంచడంతో పాటు సౌరశక్తి ఉత్పాదక సామర్థ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.దివ్యాంగులకు అనుకూలంగా టాక్టైల్ పేవర్లు ( స్పర్శ సంబంధిత టైల్స్)దృష్టిలోపం ఉ న్నవారికి, వృద్ధులకు మార్గనిర్దేశం చేసేలా టాక్టైల్ పేవర్లు మరియు గ్రెడ్ బార్లు ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ఫుట్‌పాత్ అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది.

# నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు చూడాలి.

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట నవంబర్27( సమయం న్యూస్).:** గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని ఎం ఆర్ సి భవనం, మిర్యాల , ఆత్మకూర్ ఎస్ మండలం ఏపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలలో మొదటి విడత గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎస్పీ కే నరసింహ తో కలిసి ఆయన పరిశీలించారు. నూతనకల్ ఎం ఆర్ సి భవనంలో నూతనకల్, వెంకేపల్లి, యెడవల్లి, చిల్ప కుంట్ల గ్రామపంచాయతీ సర్పంచులకు, వార్డు సభ్యులకు నామినేషన్ సేకరించడం జరుగుతుందని అలాగే మిర్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో మిర్యాల, అల్లునూరు, లింగంపల్లి,మాచనపల్లి గ్రామపంచా యతీ సర్పంచులకు వార్డు మెంబర్లకు, ఏపూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏపూరు, ఏపూరు తండా, బొప్పారం, కాశిగూడెం, మక్త కొత్తగూడెం, రామన్నగూడెం, మిద్దెనపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రంలోకి అభ్యర్థి తో పాటు మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలని అలాగే వాహనాలు 100 మీటర్ల దూరంలోనే ఆపేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు నామినేషన్ ప్రక్రియ లో ఎలాంటి సందేహాలు ఉన్న హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవాలని, ఎలాంటి తప్పులు కు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు.గ్రామాల వారీగా స్వీకరించిన నామినేషన్ పత్రాలను వేరు వేరుగా భద్రపరచాలని సూచించారు.కలెక్టర్ వెంట డి ఎస్ పి ప్రసన్న కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ లు సునీత, మహ్మద్ హసీం, ఆర్ ఓ లు,అధికారులు తదితరులు ఉన్నారు.

# శిశుగృహ, బాలసదనం నుండి పిల్లల దత్తత

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.



**కరీంనగర్ నవంబర్27( సమయం న్యూస్).:** కరీంనగర్ శిశు గృహలో పెరుగుతున్న నాలుగు నెల వయసున్న ఆడ శిశువును హుస్నాబాద్ కు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు.బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న 13 సంవత్సరాల బాలికను తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా దంపతులకు పిల్లలను దత్తత ఇచ్చారు. జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో జరిగిన ఈ దత్తత కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డి సి పి ఓ పర్వీన్, ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్విని, సాదినేని రమేష్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి.

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



**ఆదిలాబాద్ నవంబర్27( సమయం న్యూస్)** గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. పోలింగ్ బూతులు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, బ్యాలెట్ పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ వరకు ప్రతి అంశం మండలవారీగా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు శాఖతో సమన్వయం పెంచి సమగ్ర భద్రతా చర్యలు చేపట్టమని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, ఎలాంటి ఉల్లంఘనలు గమనించినా వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలకు తప్పనిసరిగా ఎంసిఎంసి అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని 166 గ్రామ పంచాయతీలకు సంబంధించిన మొదటి విడత ఎన్నికల కోసం 1408 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 20 శాతం రిజర్వులతో కలిపి మొత్తం 1478 మంది పీఓలు, 1729 మంది ఏపీఓలను నియమించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 4,49,981 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 2,19,652, మహిళలు 2,30,313, ఇతరులు 16 మంది ఉన్నారని వివరించారు. ఎన్నికల సమయంలో ఎఫ్ఎస్‌టీలు, ఎస్ఎస్‌టీలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని చెప్పారు. ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, డీపీఆర్వో విష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ప్రారంభం




**వికారాబాద్, నవంబర్,27(సమయం న్యూస్):** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ ఆష్మిన్ బాషా తో కలసి ప్రారంభించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లో భాగంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. హెల్ప్ లైన్ సెంటర్ ను పరిశీలించారు.జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ టివి లో వివిధ ఛానల్స్ తో పాటు లోకల్ ఛానల్స్ సువర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ మనోహర రాజు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ,డీపీఆర్ ఓ చెన్నమ్మ,, ఉద్యాన వన శాఖ అధికారి సత్తార్, ఇ డి ఎస్సీ కార్పొరేషన్ బాబు మోసెస్ , జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలన

- జిల్లా లోకల్ బాడీ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్.



**జనగాం నవంబర్ 27( సమయం న్యూస్).:** రఘునాథపల్లి మండలంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పింకేష్ కుమార్ ఈ రోజు విపులంగా పరిశీలించారు.మొదటగా కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్ల సిద్ధత, సిబ్బంది కేటాయింపు, ఎన్నికల సామగ్రి అందుబాటు, భద్రతా చర్యలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఎలాంటి అంతరాయం లేకుండా సాగేందుకు అవసరమైన సూచనలు అధికారులకు అందించారు.తదుపరి ఖిలాషాపూర్ క్లస్టర్‌లో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ , అభ్యర్థుల నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ, రికార్డుల నిర్వహణ, వీడియో రికార్డింగ్, పోలీస్ బందోబస్తు, ఎన్నికల నిబంధనల అమలు వంటి అంశాలను తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియను సక్రమంగా, చట్టబద్ధంగా, పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో రఘునాథపల్లి, ఎన్నికల విభాగ సిబ్బంది, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ ఖరారు లో కాంగ్రెస్ ద్రోహంమోసం

- బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ శీలం పాపారావు



**ఖమ్మం, నవంబర్ 27 :( సమయం న్యూస్ ):** అనుకున్న విధంగానే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్లు ప్రకటించి , స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసి , బీసీ జనాభా దామాషాను బట్టి కాకుండా ప్రకటించిన రిజర్వేషన్లు గమనిస్తే బీసీలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీరని ద్రోహానికి, మోసానికి పాల్పడిందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ శీలం పాపా రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీలు 12,728 లకు గాను బీసీలకు కేవలం 2,176 పంచాయతీలు కేటాయించడం గమనిస్తే కేవలం 17 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం జరిగిందని తెలుస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలుకాకముందు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అంటూ హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో జరిగిన 23 రిజర్వేషన్ శాతాన్ని కూడా అమలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ , ఆ పార్టీ ప్రభుత్వ సీఎం రేవంత్ రెడ్డి లకు బీసీల పట్ల వారికున్న చిత్తశుద్ధితెల్లమవుతుందని దుయ్యబట్టారు. బీసీలకు మోసం చేయడంలోకాంగ్రెస్ పార్టీ , సీఎం రేవంత్ రెడ్డి , బి ఆర్ ఎస్ పార్టీ , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మించిపోయారని మండిపడ్డారు. గతంలో 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఉండగా కెసిఆర్ 23 శాతానికి తగ్గిస్తే ప్రస్తుతం రేవంత్ రెడ్డి దానిని 17 శాతానికి పరిమితం చేయడం నురెండు పార్టీలలోగల బీసీలు గమనించాలని తెలిపారు. జీవో 46 నువ్వు జారీ చేయడం ఈ రిజర్వేషన్లను కుదించేందుకేనని ఇప్పుడు స్పష్టమైందన్నారు. జిల్లాలను యూనిట్ లవర్గీకరణ ఫలితంగా అనేక జిల్లాలలో బీసీల రిజర్వేషన్ల అంశం అసమతుల్యంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానం వల్లభద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి బీసీలకు ఒక్క గ్రామపంచాయతీ కూడాకేటాయించబడలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాలకు సంబంధించి కొన్ని మండలాలలోని బీసీలకు ఎలాంటి రిజర్వేషన్లు దక్కలేదన్నారు. బీసీల పట్ల ఇదే వైఖరి అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి తగిన ఫలితాన్ని అనుభవిస్తారని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠంచెప్పాలని బిజెపి రాష్ట్ర నాయకులు , డాక్టర్ శీలం పాపారావుప్రజలకు పిలుపునిచ్చారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకుడు జిల్లా కు రాక



**భూపాల పల్లి నవంబర్27( సమయం న్యూస్) :** గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఫణింద్ర రెడ్డి. ఈ సందర్భంగా జిల్లాలో జరుగునున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, పోలింగ్ నిర్వహణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నామని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఎల్కతుర్తి నవంబర్27( సమయం న్యూస్).:** తొలి దశ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నేటి నుండి ప్రారంభమవుతుందంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఎల్కతుర్తి మండలం, కేశవపూర్ గ్రామంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై సీపీ సంబంధించిన పోలీస్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ సంబంధించి రెవెన్యూ, పోలీసు అధికారులు సిబ్బంది, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలపై పోలీస్ కమిషనర్ పలుసూచనలు చేయడంతో పాటు, స్వీకరణ కేంద్రాల్లో భద్రతాపరంగా పోలీసులు పగడ్బంది ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సిపి అధికారులు ఆదేశించారు. పోలీస్ కమిషనర్ వేట సెంట్రల్ జోన్ డిసిపి కవిత, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమే ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్, ఎస్.ఐ ప్రవీణ్ కుమార్‌తో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలి

- వికారాబాద్ జిల్లా సాధారణ పరిశీలకులు షేక్ హాష్మీన్ భాష అధికారులకు సూచించారు.





**బొంరస్ పేట మండలం, నవంబర్,27(సమయం న్యూస్) :** మంగళవారం బొంరస్ పేట్ మండలంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ హాష్మీన్ భాష,వ్యయ పరిశీలకులు మనోహర్ రాజులు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధతో కలిసి నామినేషన్ల కు సంబంధించిన కేంద్రాలను పరిశీలించారు.వికారాబాద్ జిల్లా బొంరస్ పేట్ రైతు వేదికలో బొంరస్ పేట్ , దుప్చర్ల, మహంతిపూర్, జానకంపల్లి గ్రామపంచాయతీలకు అదేవిధంగా తుంకిమెట్ల రైతు వేదికలో తుంకిమెట్ల,బొట్లవాని తండా, నాగిరెడ్డి పల్లి గ్రామపంచాతీలకు సంబంధించిన నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు . ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సాధారణ పరిశీలకులు షేక్ హాష్మీన్ భాష మాట్లాడుతూ....గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆమె సూచించారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు. వ్యయ పరిశీలకులు మనోహర్ రాజు మాట్లాడుతూ.. .ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు.అభ్యర్థులు వ్యయం వివరాలు సమర్పించని ఎడల గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీలో పోటీ చేసే అభ్యర్థలకు వ్యయాలకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాత ఉండాలని ఆయన సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు పెట్టాలనే విషయము అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆయన అధికారులకు సూచించారు.నామినషన్ల కేంద్రాల పరిశీలనలో తహసిల్దార్ పద్మావతి, ఎంపిడిఓ వెంకన్న గౌడ్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# 3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు.

- జడ్పీ సీఈఓ నరేందర్
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పత్రిక సమావేశం నిర్వహించిన జడ్పీ సీఈఓ



**పెద్దపల్లి, నవంబర్ 27( సమయం న్యూస్).:** పెద్దపల్లి జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జడ్పీ సీఈఓ నరేందర్ తెలిపారు. గురువారం జడ్పీ సీఈఓ నరేందర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ నరేందర్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా పరిధిలో 263 గ్రామ పంచాయతీ సర్పంచ్, 263 ఉప సర్పంచ్, 2432 వార్డు సభ్యుల ఎన్నిక 3 విడతల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11న 99 గ్రామాలు, 896 వార్డులకు , రెండవ విడత డిసెంబర్ 14న 73 గ్రామాలు, 684 వార్డులకు , మూడవ విడత డిసెంబర్ 17న 91 గ్రామాలు, 852 వార్డులకు ఎన్నికల జరుగుతాయని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్, కౌంటింగ్ ఒకే రోజు జరుగుతాయని, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తామని, కౌంటింగ్ ముగిసిన తర్వాత అదే రోజు వార్డు మెంబర్ల ద్వారా ఉప సర్పంచ్ ఎన్నికలు జరుగుతుందని తెలిపారు.మొదటి విడత పంచాయతీలకు నవంబర్ 27న , రెండో విడత పంచాయతీలకు నవంబర్ 30న, మూడో విడత పంచాయతీలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి 3 రోజుల పాటు నామినేషన్లకు ,తర్వాతి రోజు నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉంటుందని, తర్వాత జాబితా పై అప్పీల్స్ స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు.నామినేషన్ల ఉపసంహరణ మొదటి విడత పంచాయతీలకు డిసెంబర్ 3, రెండో విడత పంచాయతీలకు డిసెంబర్ 6, మూడో విడత పంచాయతీలో డిసెంబర్ 9 మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుందని, అదే రోజున పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ పోటీ చేసే అభ్యర్థులు 2 లక్షల 50 వేల రూపాయలు, వార్డు మెంబర్ 50వేల రూపాయలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు లక్ష 50 వేల రూపాయలు, వార్డు మెంబర్ 30 వేల రూపాయలు గరిష్టంగా ప్రచార నిమిత్తం ఖర్చు చేసే వీలు ఉందని ఆయన తెలిపారు.జనరల్ కేటగిరి సర్పంచ్ అభ్యర్థి రెండు వేల రూపాయలు వార్డు మెంబర్ అభ్యర్థి 500 రూపాయలు, బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వ్ స్థానాలలో సర్పంచ్ అభ్యర్థి వెయ్యి రూపాయలు, వార్డ్ మెంబర్ అభ్యర్థి 250 రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసామని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం 3 ఎస్టి (మహిళలు1 ,జనరల్ 2) ,54 ఎస్సీ (మహిళలు 24 ,జనరల్ 30) , 69 బీసి (మహిళలు30 , జనరల్ 39 ,134 ఓపెన్ క్యాటగిరి (మహిళలు65 , జనరల్ 69 రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 4లక్షల 4 వేల 181 మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని, 274 పోలింగ్ లొకేషన్ లలో 2432 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 85 రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు కలిపి 3804 సిబ్బందిని నియమించామని అన్నారు.సమస్యాత్మక ప్రాంతాలలో గుర్తించిన 1099 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎంసిసి కోడ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా ఎం.సి.ఎం.సి అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, జర్నలిస్టులు, పాత్రికేయులు, వివిధ వర్గాల ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని జడ్పీ సీఈఓ కోరారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# "షీ" టీమ్ ఆధ్వర్యంలో ప్రగతి విద్యాలయంలో అవగాహన కార్యక్రమం

- సైబర్ నేరాలు, వేధింపులపై విద్యార్థుల్లో "షీ" టీమ్ తో చైతన్యం : "షీ' టీమ్ పరిగి డివిజన్ ఇంచార్జ్ నర్సింహులు









**పరిగి మున్సిపల్ (మం) నవంబర్,27(సమయం న్యూస్)**

మహిళల భద్రతను లక్ష్యంగా "షీ" టీమ్ నిరంతరం కృషి చేస్తుందనిపరిగి డివిజన్ షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు అన్నారు. గురువారం పరిగి పట్టణం లోని ప్రగతి విద్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా,, పరిగి డియస్పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు షీ టీం పరిగి డివిజన్ ఇంచార్జ్ విద్యార్థులకు "షీ" టీమ్ పని తీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం పరిగి డివిజన్ ఇంచార్జ్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వేధింపులు, ఈవ్–టీజింగ్ అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందించడం ఈ విభాగం ముఖ్య భాద్యతలుగా తెలిపారు. అదే విధంగా పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 181 లేదా 100 నంబర్లకు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అదేవిదంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ మానవ అక్రమ రవాణా తోపాటు మద్యపాన నిషేధం గురించి వివరించారు. అంతే కాకుండా మహిళలు బాలికలు టి–సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని తెలిపారు.విద్యాసంస్థలు, కాలేజీలు, ప్రజా ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలకు చట్టపరమైన రక్షణల గురించి తెలియజేయడం, హెల్ప్‌లైన్ నెంబర్ల వినియోగంపై సూచనలు ఇవ్వడం "షీ" టీమ్ ప్రధాన విధుల్లో ఒకటి. మహిళల భద్రతకు అండగా నిలుస్తూ "షీ" టీమ్ సేవలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాలయ హై స్కూల్ ప్రిన్సిపాల్ కల్పన, కరస్పాండెంట్ వి. ప్రకాశ్, ఉపాధ్యాయులు,విద్యార్థినిలు, విద్యార్థులు, "షీ" టీమ్ సభ్యులు శోభ,బి సావిత్రి, తదితరులు ఉన్నారు.

# నర్సారెడ్డి ఆధ్వర్యంలో రిమ్మనుగూడ లో కాంగ్రెస్ లో చేరికలు

**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 27 :** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది రిమ్మనగూడ కాంగ్రెస్ నాయకులు మాధవరావు నర్సింగ్ రావు ఐలమల్లు ఆధ్వర్యంలో సుమారు 30 మంది బిఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు నాయకులను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి గజ్వేల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు తుంకుంట నర్సారెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తుంకుంట ఆంక్షరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ డైరెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు



# ఆరెకటికల సమస్యలపై పోరాడాలంటే ఏక నాయకత్వం కావాలి

- ఆరెకటికే రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ జమాల్పూర్ బాలరాజ్
- కళ్యాణ్ కర్ నర్సింగరావు



**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 27 :** ఆరెకటికలు అందరూ ఒకే తాటిపై నిలబడి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆరెకటికే రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ జమాల్పూర్ బాలరాజ్ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో గజ్వేల్ అరెకటిక సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరెకటికలు అందరూ ఒకే రాష్ట్రం ఒకే ఆరెకటిక అధ్యక్షుడు అనే నినాదంతో బయలుదేరి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నామని, రాష్ట్ర అధ్యక్షుని ఎన్నుకోవడం గురించి తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మండలం నుంచి ముడు ఓట్లతో నియోజకవర్గం, జిల్లా అలాగే రాష్ట్ర స్థాయి వరకు అందరిని కలిసి చర్చించుకొని రాబోయే రోజుల్లో హైదరాబాద్ మహానగరంలో పెద్ద ఎత్తున ఎన్నికల నిర్వహించి ఆరెకటిక రాష్ట్ర అధ్యక్షుని ఎన్నుకుంటామని తెలిపారు. ఆరెకటికి కుల బంధువులను కలవడంతో ఇక్కడికి వెళ్లిన మంచి స్పందన లభిస్తుందని అలాగే రాష్ట్రంలో అరెకటిక కులస్తుడు ఎవరైనా రాష్ట్ర అధ్యక్ష పోటీలో ఉండవచ్చని ఈ ఎన్నికలు పూరి పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎన్నికలు విజయవంతం చేసి అరకటిక ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కళ్యాణ్ కర్ నర్సింగరావు మాట్లాడుతూ ఆరెకటికల యొక్క సామాజిక అంశాలను తెలుసుకోవడానికి ఒక రాష్ట్ర నాయకత్వం ఉండాలనే ఆలో చనతో మా సంఘ పెద్దలు తీసుకున్నట్టు నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నామని, అరెకటికలకు సంబంధించిన అన్ని అంశాల మీద బీసీ కమిషన్ వద్ద గాని, మా సంబంధిత నాయకుల వద్ద గాని మాట్లాడానికి ఒక నాయకత్వం కావాలని అలాంటి నాయకత్వాన్ని అందరూ కలిసి ఒకరిని ఎన్నుకొని ఏక నాయకత్వంలో మన సమస్యల మీద ముందుకు వెళ్లాలనే ఆలోచన మన సంఘ పెద్దల నిర్ణయం హర్షించదగిందని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి తమ వంతుగా సంఘ నాయకత్వం ఏర్పాటులో సహాయం అందజేస్తామని జిల్లా నుండి, ప్రతి మండలం నుండి సభ్యులను ఓటింగ్ లో పాల్గొన్నట్లు చూస్తామని తెలిపారు. అలాగే ఇతర బీసీ సామాజిక వర్గాలు ప్రభుత్వాల నుండి ఎలా లబ్ధి పొందుతున్నారో అలాంటివి మన సంఘం కూడా లబ్ధి పొందాలంటే ఏక నాయకత్వం ఉండాలని అందుకు అందరు సభ్యులు ఓటింగ్ లో పాల్గొని సహకరించాలని కోరారు. అరేకటికె కమిటీ వైస్ చైర్మన్ నేతిక రవికుమార్, జనరల్ సెక్రెటరీ దండోతికర్ జితేందర్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ మురళీధర్, కళ్యాణ్కర్ కిషన్, జమాల్పూర్ శ్రీనివాస్, కళ్యాణ్కర్ రమేష్, కళ్యాణ్ కర్ శివాజీ, జమాల్పూర్ విటల్, యాదిలాల్, నందలాల్, రాజు, రామచంద్రం, అశోక్, పెద్ద లక్ష్మణ్, శ్రీనివాస్, బన్సిలాల్, నర్సోజి, కేశు, శంకర్, చిన్న లక్ష్మణ్, రమేష్, తుక్కోజి, రాజు, పవన్, సొన్ లాల్, నిఖిల్, చందులాల్, చిన్న శ్రీను, నాగరాజు, మహేష్, సందీప్, రాజేశ్వర్, సాయికుమార్ పాల్గొన్నారు.

# నాగమడుగు ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలి

- జాగృతి అధ్యక్షురాలు కవిత



**బాన్సువాడ, సెప్టెంబర్ 27 (సమయం న్యూస్):** కామారెడ్డి జిల్లాలోని నాగమడుగు ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. రూ. 430 కోట్లతో ప్రారంభించిన ఈ పథకానికి ఇప్పటివరకు మూడో వంతు నిధులు కూడా ఇవ్వలేదని ఆక్షేపించారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా నిజాంసాగర్ మండలంలో జరుగుతున్న ఎత్తిపోతల పనులను పరిశీలించిన సందర్భంగా కవిత మాట్లాడుతూజుక్కల్ నియోజకవర్గంలో సాగు నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. నిజాంసాగర్ ఉన్నప్పటికీ అక్కడి నీటితో జుక్కల్ రైతులకు ప్రయోజనం లేకుండా ఉందని తెలిపారు. జుక్కల్ ప్రాంతంలో చెరువుల ద్వారా 22 వేల ఎకరాలు, కౌలాస్ నాలా ద్వారా 9 వేల ఎకరాలు సాగు అవుతున్నాయని వివరించారు. మహారాష్ట్రతో జరిగిన వివాదాల కారణంగా లెండి ప్రాజెక్ట్ ఎన్నో ఏళ్లుగా పూర్తికాకుండా ఉందని తెలిపారు.

### 40 వేల ఎకరాలకు నీళ్లు అందించేందుకు రూపొందించిన పథకం

జుక్కల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నాగమడుగు ఎత్తిపోతల పథకం రూపొందించారని కవిత చెప్పారు. మంజీర నది నుంచి నీటిని ఎత్తిపోసేందుకు సుమారు 200 ఎకరాల భూసేకరణ అవసరమైతే ఇప్పటివరకు పంప్ హౌస్ కోసం 12 ఎకరాలు మాత్రమే సేకరించారని, చెక్‌డ్యాం, కరకట్టల కోసం అవసరమైన భూమిని సేకరించకుండానే నిర్మాణాలు ప్రారంభించడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్టు చెప్పారు. ఈ నిర్మాణాల వల్ల మూడు గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, పైగా వారికి సాగు నీరు కూడా రాకపోతుందనే ఆందోళన నెలకొ న్నదని పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరా లతో కూడిన డీపీఆర్‌ను ప్రభుత్వం ప్రజల ముందుం చాలని, ఏ గ్రామాలు ముంపు ప్రమాదంలో ఉన్నాయో స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా డీపీఆర్ సిద్ధం చేయలేదని విమర్శించారు.

### రైతుల నష్టపరిహారంపై స్పష్టత అవసరం

వడ్డేపల్లి పంప్ హౌస్ పనులు ఏళ్లుగా నిలిచిపోయాయని, తమ పర్యటన ఉందని తెలిసి రెండు రోజుల క్రితమే అక్కడ పనులు క్లీన్ చేసి మోటార్లు ఆన్ చేశారని చెప్పారు. నిర్మాణాల పేరుతో భారీ వాహనాలు రావడంతో గ్రామాలన్నింట్లో ప్రజలకు ఇబ్బందులు పెరిగాయని వివరించారు. ప్రాజెక్ట్ నిర్మాణాల వల్ల అర, పావు ఎకరం భూమి కోల్పోతున్న రైతుల సమస్యను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా చూసి స్పష్టమైన నష్టపరిహార నిర్ణయం ప్రకటించాలని కవిత కోరారు. గతంలో ఎకరానికి 17 లక్షలు ఇచ్చారని, ఇప్పుడు భూదరలు పెరిగిన నేపథ్యంలో రైతులు ఎకరానికి ఎకరం భూమి లేదా రూ. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.

**నిధుల విడుదలలో నిర్లక్ష్యం..** రూ. 430 కోట్లతో ప్రారంభించిన ఈ పథకానికి ఇప్పటి వరకు మూడో వంతు నిధులు కూడా ఇవ్వకుండా ఆగమాగం కేటాయింపులతో పనులు సాగుతుండటం వల్ల ప్రాజెక్ట్ పూర్తికావడానికి మరికొన్ని సంవత్సరాలు పట్టే పరిస్థితి వచ్చిందని కవిత విమర్శించారు. ఈ సమస్యను ఇక్కడితో వదిలిపెట్టబోమని, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కలిసి పరిష్కారానికి ప్రయత్నిస్తామని చెప్పారు. అవసరమైతే రైతులతో కలిసి ఇరిగేషన్ మంత్రిని కలిగి ఆందోళన చేయడానికి సిద్ధమని హెచ్చరించారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మైనారిటీలకు అవకాశం కల్పించాలి


-మైనారిటీ నాయకులు ఎస్.ఎం.గౌసన్



**కొడంగల్ మున్సిపల్(మం)నవ ంబర్ 27 (సమయం న్యూస్) :** కొడంగల్ నియోజకవర్గ పరిధిలో కేటాయించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో అభ్యర్థులుగా పోటీ చేసేందుకు మైనారిటీలకు అవకాశం కల్పించాలి. స్థానిక ఎలక్షన్‌లో అభ్యర్థులగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలి. మైనారిటీ లు వివిధ పార్టీలకు ప్రచారంలో ఓట్లు రాబట్టడంలో కష్టపడి పనిచేస్తూ పార్టీ తరపున సేవా కార్యక్రమాల్లో, ప్రచార కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ ఎప్పటికైనా మమ్మల్ని గుర్తించి ఉన్నత స్థాయిలకు చేకూరుస్తుందనే నమ్మకంతో మైనారిటీ సోదరులు పార్టీలలో పనిచేస్తున్నారు. అటు నామినేట్ పోస్టులకు కానీ ఏ పదవి కూడా ఇంతవరకు దరి చేరలేదు, స్థానిక ఎలక్షన్‌లో మైనారిటీ లు పోటీలో ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు. రాజకీయ పార్టీలకు కొన్నేళ్లుగా కార్యకర్తలుగా కష్టపడి పనిచేస్తూ సీనియర్లుగా గుర్తింపు తెచ్చుకున్న కూడా అధిష్టానం గుర్తించలేకపోతుంది. నామినేటెడ్ పోస్టులు కూడా వారికి కేటాయించకపోవడంతో మైనార్టీలు నిరుత్సాహంతో ఉన్నారని తెలుస్తుంది. స్థానిక ఎలక్షన్లో కూడా రాజకీయం చేస్తూ.. పార్టీలకు చెందిన నాయకులు గ్రామాలలో మీటింగ్ లు పెడుతూ జనరల్ రిజర్వేషన్లో అగ్రకులస్తులకే సీట్లను కేటాయించడం జరుగుతుందని కొన్నేళ్లుగా ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. ఇలా చేయడం వల్లే ప్రజలు నాయకుల మీద నమ్మకం పోయి ఓటమి పాలవుతున్నారని, మాకు అవకాశం కల్పించాలని మైనారిటీ లు కోరారు.

# తుదిశ్వాసవిడిచి కూడ సహాయపడదాం

- మెడికల్ కళాశాలకు పార్థివదేహం దేహం దానం



**వనపర్తి జిల్లా నవంబర్ 27 (సమయం) :** తాను నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి జీవించిన కాలం సహాయపడుతూ మరణించిన అనంతరం కూడా ఇతరులకు సహాయపడాలన్న సామాజిక స్పృహ తో వనపర్తి మెడికల్ కళాశాలకు చీర్ల రామచంద్ర(81)విశ్రాంతా రైల్వే ఉద్యోగి తన మృతదేహం దానం చేసేందుకు అంగీకారం తెలిపారు. రామ్ చందర్ కుమారుడు శ్రీధర్,కుటుంబ సభ్యులు తమ తమ తండ్రి చివరి కోరిక తీర్చాలనీ అనారోగ్యం తో మరణించిన తమ తండ్రి రామచందర్ మృతదేహాన్ని గురువారం కళాశాల వైద్య ప్రిన్సిపల్ మల్లికార్జున్,ప్రొఫెసర్లు,విద్యార్థుల సమక్షంలో అప్పగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్లు మాట్లాడుతూ మరణం అనంతరం మెడికల్ కళాశాలకు దానం చేయడం ద్వారా విద్యార్థుల వైద్య విద్య అధ్యయనంలో పరిశోధనలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అనాటమీ హెచ్ ఓ డి హరికృష్ణ, ప్రొఫెసర్ ఆనంద్ డేవిడ్, కాలేజీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# టీబీ ముక్తా అభియాన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

- డాక్టర్ అమూల్య ప్రియదర్శిని
- క్యాంపులో 118 మందికి పరీక్షించడం జరిగింది-డాక్టర్





**దౌల్తాబాద్ మండలం, నవంబర్,27(సమయం న్యూస్) :** సరైన సమయంలో టీబీ చికిత్స తీసుకుంటే టీబీ ను అరకట్టవచ్చు దానితోపాటు పోషకాహారం కూడా తీసుకుంటే త్వరగా నయం అవుతుందని అలాగే 2 వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, రాత్రి పూట చమటలు పట్టడం మొదలగు లక్షణాలుంటే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తేమడ్డ పరీక్ష చేయించుకోవాలని వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దౌలతబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్దురాలు డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు .ఈ క్యాంపు లో మొత్తం 118 మందికి పరీక్షించడం జరిగింది అందరికి బీపీ,షుగర్, పరీక్షలతో పాటు 32 మందికి తేమడ పరీక్ష కోసం సాంపిల్స్ సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ సౌమ్య,, టీబీ సూపర్ వైజర్ రహత్ అలీ, సూపర్ వైజర్ ఏఎన్ఎం లు అనురాధ, నర్సమ్మ , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు



**హైదరాబాద్, నవంబర్ 27,(సమయం న్యూస్) :** నగరంలో విస్తారమైన రోడ్లు ఉన్నప్పటికీ అస్తవ్యస్తమైన పార్కింగ్ వల్ల చాలా రోడ్లు ఇరుకు అయిపోతున్నాయి. వాహనదారుల పరిస్థితి ఈ విధంగా ఉంటే పాదచారుల పరిస్థితి మాత్రం వర్ణనాతీతం. కొన్ని ప్రాంతాల్లో కనీసం ఫుడ్ పాత్ పై నడవడానికి కూడా స్థలం లేని పరిస్థితి ఏర్పడింది. కొంతమంది ఫుట్పాతులనే అడ్డాలుగా మార్చుకొని వ్యాపారాలు సాగిస్తుండటంతో షాప్ లలోకి వెళ్లలేని పరిస్థితితో పాటుగా పాదచారులు కూడా నడవలేని పరిస్థితి ఏర్పడింది. చిక్కడపల్లిలోని వెంకటేశ్వర స్వామి కమాన్ వద్ద ఫుట్పాత్ ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిస్తున్నారని జిహెచ్ఎంసి, ట్రాఫిక్ సిబ్బందికి వీటి పైన చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోలేని పరిస్థితి. నగరంలో వెండింగ్ పాలసీని అమలు చేస్తున్నమని జిహెచ్ఎంసి అధికారులు చెబుతూ ఇలా ఫుట్పాత్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్న వారిపట్ల చూసి చూడనట్లు వ్యవహరిస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోంది. ఏది ఏమైనప్పటికీ పాదచారుల కోసం కేటాయించిన ఫుట్ పాత్ లలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని స్థానికులు జిహెచ్ఎంసి అధికారులను కోరుతున్నారు


# జే యు హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ సయీద్ అహమద్ ఖాస్మి కు సన్మానం



**ఖమ్మం, నవంబర్ 27:( సమయం న్యూస్ )** ఇటీవల హైదరాబాద్ లో జరిగిన జమియత్ ఉలేమా ఏ హింద్ (జే యు హెచ్ ) ఎన్నికలలోఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మౌలానా మొహమ్మద్ సయీద్ అహమద్ ఖాస్మిరాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికవ్వడంపై సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కాల్వ ఒడ్డు ప్రాంతం లోని మదర్సా ఇస్లామీయ దారుల్ ఉలూమ్ లో స్తానిక మోమినాన్ మసీదు మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హకీమ్, మోమినాన్ మసీదు ఇమామ్ మౌలానా జ బీ ఉ ల్లా , బాధ్యులు షేక్. అహ్మద్ లు సన్మానించి, మాట్లాడారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మరింత విస్తృతం గా ధార్మిక, సామాజిక సేవలను తల పెట్టాలని అన్నారు.

# దామరచేడ్ పంచాయతీలో నామినేషన్ దాఖలు..

- హాజరైన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి..





**బషీరాబాద్,మండలం, నవంబర్27(సమయం న్యూస్) :** పంచాయతీ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం దామరచేడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి సతీమణి భారతి ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పైలెట్ రోహిత్ రెడ్డి కూడా హాజరై ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా భారతి శ్రీనివాస్ రెడ్డి మరియు దామరచేడ్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పైలెట్ రోహిత్ రెడ్డి సహకారంతో గతంలో గ్రామంలో అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం ఇస్తే గ్రామంలో నెలకొన్న సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉద్యమకారులకు 250 గజాల స్థలం హామీపై ప్రభుత్వం మోసం చేసింది


● జాగృతి అధ్యక్షురాలు కవిత



**బాన్సువాడ, సమయం న్యూస్:** ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హామీని నిలబెట్టుకోకుండా మోసం చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.జనం బాట కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మండలం కొయ్యగుట్ట అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు.ఉద్యమకారులకు పింఛన్, గుర్తింపు కార్డులు జారీ చేసే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.అలాగే, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న సౌకర్యాల రుసుములను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల చందూర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి మృతిపై ప్రభుత్వం పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరారు.

## టిఇ పోల్ మొబైల్ యాప్ ద్వారా కావలసిన సమాచారం పొందవచ్చు

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**వికారాబాద్, నవంబర్,27(సమయం న్యూస్) :** టిఇ పోల్ మొబైల్ యాప్ ద్వారా కావలసిన సమాచారాన్ని పొందవచ్చునని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.మొబైల్ యాప్ ద్వారా ఓటర్ యొక్క ఓటర్ స్లిప్ ను పొందవచ్చునని ఆయన తెలిపారు.పోలింగ్ స్టేషన్ల వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదును కూడా యాప్ ద్వారా తెలియచేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.

## మాదారం గ్రామంలో అంగరంగ వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



**పటాన్ చేరు, జిన్నారం, నవంబర్ 27(సమయం న్యూస్):**సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామంలో గురువారం అయ్యప్ప స్వామివారి మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ సహోదరుని నివాసంలో జరిగిన ఈ పవిత్ర కార్యక్రమానికి వేలాదిమంది అయ్యప్ప భక్తులు, పరిసర ప్రాంతాల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని భక్తి శ్రద్ధలతో స్వామివారిని ఆరాధించారు.రాఘవేందర్ గురుస్వామి కరకమలములచే ప్రధాన పూజా కార్యక్రమం నిర్వహించగా, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన గురుస్వాములు ప్రత్యేక పూజలు,ఆభరణాల ఊరేగిపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి ప్రార్థనలతో, భజనలతో, స్వామి మాలధారణ చేసిన అయ్యప్ప భక్తుల 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో గ్రామం మొత్తం భక్తి పరవశంతో మార్మోగింది.స్థానిక భక్తులు, వలస ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ వ్యవస్థను నిర్వాహకులు భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. శ్రద్ధాభక్తులతో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల సందోహంతో కిటకిటలాడింది. పూజా కార్యక్రమాల్లో మహిళలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం. భక్తి పరవశంతో జరిగిన ఈ అయ్యప్ప పడిపూజ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

## అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా పల్లకి సేవ మరియు సద్దిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

- పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు మున్సిపల్(మం)నవంబర్,27(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం తాండూరు పట్టణంలో నిర్వహించిన పల్లకి సేవ మరియు భద్రప్ప దేవాలయంలో యువ నాయకుడు రుద్రూపాటిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సద్దిలో పాల్గొన్న పైలెట్ రోహిత్ రెడ్డి,మరియు శ్రీశైల్ రెడ్డి మరియు అయ్యప్ప స్వాములు ఉన్నారు.

# ఖమ్మం జిల్లాలో శర వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా
- పారదర్శక చర్యలు
- హౌసింగ్ పీడీ భూక్య శ్రీనివాస్
- ( సమయం ఇంటర్వ్యూలో ...)



**ఖమ్మం , నవంబర్ 27 : ( సమయం న్యూస్ ) :** ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగాకొన సాగుతున్నాయని , ఇందులో ఎలాంటి అవినీతి , అక్రమాలకు తాగు లేకుండా పారదర్శక చర్యలు చేపట్టడం జరిగిందని ఖమ్మం హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ భూక్య శ్రీనివాస్ ... ఖమ్మం ఉమ్మడి జిల్లా సమయం ప్రతినిధి యం డి. షఫీ యు జమ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలుపుతూ , ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వివిధ దశలను వివరించారు. ఖమ్మం జిల్లాకు ఇందిరమ్మ ఇళ్లు 16 , 678మంజూరయ్యాయి. ఇందులో పునాదులు తీయబడ్డ ఇల్లు 4 ,353 , గోడలు పూర్తి చేసుకున్న ఇల్లు ( రూఫ్ లెవెల్ ) 3 , 571 , స్లాబ్ పూర్తి చేసుకున్నవి 5 వేల 81 కాగా జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లు 140 . జిల్లాలో సుమారు 20 మండలాలు , ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఎదులాపురం మున్సిపాలిటీలలో కూడా ఇళ్లనిర్మాణాల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో మధిరమున్సిపాలిటీనిమీనహాయించడం జరిగింది. మధిర నియోజకవర్గంలో మాత్రం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం నియోజవర్గానికి 3 ,428మంజూరు కాగా పునాదులు పూర్తి చేసుకున్నవి 1036 , గోడలు పూర్తి చేసుకున్నవి 490 , స్లాబులు పూర్తి చేసుకున్నవి 358 . ఇందులోఇల్లు పూర్తయినవి 3 . మధిర నియోజవర్గానికి సంబంధించి 2 ,795ఇళ్లుమంజూరు కాగా961 ఇల్లుపునాదులు పూర్తి చేసుకోగా 781 గోడలు పూర్తి చేసుకున్నవి.692 ఇల్లు స్లాబులు పూర్తి చేసుకోగాపూర్తయినవి 10 ఇళ్లు. పాలేరు నియోజకవర్గానికి 3 ,518 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా పునాదులు పూర్తి చేసినవి 686 , గోడలు పూర్తి చేసుకున్నవి 702 , స్లాబులు పూర్తి చేసుకున్నవి 1552 . పూర్తి నిర్మాణం అయిన ఇల్లు 46. సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించి 3481 ఇళ్లు. పునాదుల దశ దాటినవి 661 , గోడల దశ దాటినవి 731 , స్లాబులదశ పూర్తి చేసుకున్నవి 1638 . 51 ఇల్లు పూర్తయ్యాయి. వైరా నియోజకవర్గానికి 2 ,929 ఇల్లు మంజూరు కాగా858 పునాదులు ,741 గోడలు , 803స్లాబుల దశలు దాటగా 22 ఇళ్ళు పూర్తయినాయి. ఇల్లందు నియోజకవర్గం( కామేపల్లి మండలం ) కు 527 ఇళ్లు మంజూరు కాగా 151 పునాదుల ,115 గోడల ,138 స్లాబుల దశలు దాటుకోగా నాలుగు ఇల్లు పూర్తిగా పూర్తయ్యాయి. ఇందిరమ్మ విల్లా నిర్మాణాల దశలను బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తున్నామని , ఖమ్మం నియోజకవర్గం లబ్ధిదారులకు 34 కోట్ల 63 లక్షలు , పాలేరు నియోజకవర్గానికి 85 కోట్ల 28 లక్షలు , మధిర నియోజకవర్గం లబ్ధిదారులకు 53 కోట్ల 43 లక్షలు , వైరా నియోజకవర్గం కు 56 కోట్ల 74 లక్షలు , సత్తుపల్లి నియోజకవర్గం కు89 కోట్ల 60 లక్షలు , ఇల్లందు ( కామేపల్లి మండలం )నియోజకవర్గం లబ్ధిదారులకు 9కోట్ల 53 లక్షల రూపాయలను చెల్లించినట్లు ప్రకటిస్తూహౌసింగ్‌పీడీభూక్యశ్రీనివాస్‌ఇంటర్వ్యూను ముగించారు

# మొదటి విడత గ్రామ పంచాయతీ నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, నవంబర్ 27:( సమయం న్యూస్ ):** ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.గురువారం నుండి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ మొదలైంది. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం గ్రామాల నామినేషన్లు స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. దాఖలు చేసే నామినేషన్ ప్రతాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఏలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై పూర్తి భాద్యతతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.జిల్లాలోని 7 మండలాలలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 192 సర్పంచ్, 1740 వార్డు సభ్యుల స్థానాలకు గురువారం నుండి ఈనెల 29 శనివారం వరకు ఉదయం గం.10-30 నిమిషాల నుండి సాయంత్రం 5.00 గంటలకు వరకు కేటాయించిన కేంద్రాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. మొదటి విడుతలో 3వేల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు.ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎన్నికల సిబ్బందికి అందించాలని, ప్రతి గ్రామంలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు, సిబ్బంది, పోలీసు సుమారు 8వేల మంది నియామకం పూర్తి చేశామని అన్నారు.పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందిస్తామని అన్నారు. కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ర్యాలీ, ప్రచారాలు అనుమతి లేవని, ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తూ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగు తుందని అన్నారు. కలెక్టర్ వెంట రఘునాథపాలెం మం డల తహసీల్దారు శ్వేత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు న్యాయం చేయండి.

- టిజేఎసి వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్
- సర్పంచ్, వార్డు రిజర్వేషన్లలో బీసీల వాటా గణనీయంగా తగ్గింపు
- గత నోటిఫికేషన్‌తో పోల్చితే వందల స్థానాలు కోల్పోయిన బీసీలు



**పరిగి మున్సిపల్(మం) నవంబర్ 27(సమయం న్యూస్)**

ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ కేటాయింపుల్లో బీసీ సమాజం పట్ల తీవ్ర అన్యాయం జరిగిందని టిజేఎసి వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఆరోపించారు. బీసీల జనాభా రాష్ట్రంలో 60 శాతం కన్నా ఎక్కువ ఉన్నప్పటికీ, రిజర్వేషన్లలో 20 శాతం కూడా ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి అవమానమని చెప్పారు.వికారాబాద్ జిల్లాలో మొత్తం 594 గ్రామ పంచాయతీల్లో బీసీలకు కేటాయించిన సర్పంచ్ స్థానాలు కేవలం 107 మాత్రమే, ఇది 18.01%. బీసీలకు ఇవ్వాల్సిన శాతం 22.3% అయితే ఇవ్వాల్సినవి 132 స్థానాలు కావాలి. ఇలా బీసీలు 25 సర్పంచ్ స్థానాల నష్టం వాటిల్లిందని తెలిపారు.గత నోటిఫికేషన్ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ ఉండగా ఇవ్వాల్సిన సర్పంచ్ స్థానాలు 249. ప్రస్తుత కేటాయింపుతో పోల్చితే బీసీలు 142 సర్పంచ్ స్థానాలు కోల్పోయారు అని ముకుంద నాగేశ్వర్ అన్నారు. జిల్లాలోని మొత్తం 5058 వార్డుల్లో, బీసీలకు కేటాయించినవి 995 మాత్రమే, అంటే 19.67%. కానీ 22.3% ప్రకారం ఇవ్వాల్సినవి 1127 కావాలి. దీంతో బీసీలకు 133 వార్డు సభ్యుల నష్టం జరిగింది.గత ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం 42% ఇస్తే ఇవ్వాల్సిన వార్డులు 2124, ప్రస్తుతం 995 మాత్రమే ఇవ్వడంతో బీసీలకు 1129 వార్డు సభ్యుల స్థానం నష్టం జరిగిందని పేర్కొన్నారు.ప్రభుత్వం కోర్టు తీర్పులను ఆధారంగా తీసుకుని 50% మించకుండా రిజర్వేషన్లు కేటాయించడంతో బీసీల మెజారిటీ హక్కులు మసకబారుతున్నాయని ఆయన విమర్శించారు.బీసీల ప్రజాస్వామిక హక్కుల కోసం ముందుకు వచ్చి స్వయం పోరాడాలి, సామాజిక న్యాయం కోసం బీసీ వర్గాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ముకుంద నాగేశ్వర్ పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్టీని విడి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**బొంరస్ పేట మండలం, నవంబర్ 27(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్ పేట్ మండలం నుండి అనంతరెడ్డి మరియు ఎంకేపల్లి గ్రామం నుండి మధుసూదన్ రెడ్డి వారి అనుచరులు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం




సౌతాఫ్రికా చేతిలో 2-0తో వైట్‌వాష్ అవ్వడం టీమ్‌ఇండియాకు కోలుకోలేని దెబ్బ అనే చెప్పాలి. సొంతగడ్డపై 408 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం, 25 ఏళ్ల తర్వాత సఫారీల చేతిలో సిరీస్ కోల్పోవడం ఒక ఎత్తైతే, ఇప్పుడు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం కావడం మరో ఎత్తు. వరుస ఓటములతో సతమతమవుతున్న భారత జట్టుకు ఇప్పుడు సుదీర్ఘ విరామం లభించింది. సౌతాఫ్రికా సిరీస్ ఓటమితో 2025లో టీమ్‌ఇండియా టెస్ట్ షెడ్యూల్ ముగిసింది. ఇక భారత జట్టు మళ్లీ వైట్ జెర్సీలో కనిపించాలంటే దాదాపు 8 నెలలు ఆగాల్సిందే. అంటే వచ్చే ఏడాది (2026) జూన్‌లోనే టెస్టు మ్యాచ్ ఉండనుంది. జూన్ 2026లో ఆఫ్ఘానిస్థాన్?తో భారత్ ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్ డబ్ల్యూటీసీ సైకిల్‌లో భాగం కాదు. ఆ తర్వాత ఆగస్టులో శ్రీలంక పర్యటన, అక్టోబర్, నవంబర్‌లో న్యూజిలాండ్ పర్యటనలతో అసలు సిసలైన టెస్ట్ సీజన్ మొదలవుతుంది.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ సైకిల్‌లో ఆడాల్సిన 18 మ్యాచ్‌లలో ఇప్పటివరకు 9 మ్యాచ్‌లు పూర్తి కాగా, విన్నింగ్ పాయింట్ పర్సెంటేజీ 48.15 మాత్రమే ఉంది. దీంతో పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియా 5వ స్థానానికి పడిపోయింది. ఫైనల్ చేరాలంటే టాప్-2లో ఉండటం తప్పనిసరి. ప్రస్తుతమున్న 48.15 శాతాన్ని కనీసం 60 శాతానికి పెంచుకుంటే తప్ప ఫైనల్ రేసులో నిలవడం కష్టం. ఇది అంత సులువైన విషయం కాదు. టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే సమీకరణాలు చాలా కఠినంగా ఉన్నాయి. మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 6 మ్యాచ్‌లు గెలవాలి. ఒకవేళ 3 మ్యాచ్‌లు డ్రా అయినా పర్లేదు కానీ, ఒక్క మ్యాచ్ ఓడిపోయినా పరిస్థితి చేజారిపోతుంది. శ్రీలంకలో 2 టెస్టులు, న్యూజిలాండ్‌లో 2 టెస్టులు ఆడాల్సి ఉంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా జట్టు 5 టెస్టుల సిరీస్ కోసం భారత్?కు రానుంది. విదేశీ గడ్డపై లంక, కివీస్‌ను ఓడించి, సొంతగడ్డపై ఆసీస్‌ను చిత్తు చేస్తే తప్ప ఫైనల్ బెర్త్ ఖాయం కాదు. 2026 ఆగస్టులో శ్రీలంకతో జరిగే 2 టెస్టుల సిరీస్ డబ్ల్యూటీసీలో భాగం. ఆ తర్వాత అక్టోబర్ నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి గడ్డపై 2 టెస్టులు ఆడాలి. సొంతగడ్డపైనే మనం కివీస్ చేతిలో ఓడిపోయాం, మరి వారి గడ్డపై గెలవడం అంటే కత్తి మీద సామే. ఇక చివరగా భారత్?లో జరిగే బోర్డర్ గావస్కర్ ట్రోఫీ (ఆస్ట్రేలియా సిరీస్) నిర్ణయాత్మకం కానుంది. సొంతగడ్డపై ఇతర జట్లే మనల్ని ఓడిస్తున్నప్పుడు, ఆస్ట్రేలియాను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా మారుతుంది. 2026లో టీమ్‌ఇండియా టెస్టులతో పాటు వన్డేలు, టీ20లపై కూడా దృష్టి పెట్టనుంది. జనవరిలో న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లు, ఫిబ్రవరి, మార్చిలో టీ20 వరల్డ్ కప్ ఉన్నాయి. మొత్తం మీద 2026లో భారత్ కేవలం 5 టెస్టులు (ఆఫ్ఘానిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్) మాత్రమే ఆడనుంది. ఆసీస్ సిరీస్ ఆ తర్వాత ఉంటుంది. ఈ గ్యాప్?లో టీమ్‌ఇండియా తమ లోపాలను సరిదిద్దుకుని, స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ ఇస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

## నా భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐనే

### భారత కోచ్ గంభీర్ సంచలన కామెంట్స్




గువాహటి టెస్టులో సౌతాఫ్రికాపై భారత్ ఘోర ఓటమి చవిచూసింది. 408 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. పరుగుల పరంగా టెస్టు క్రికెట్ చరిత్రలో టీమ్‌ఇండియాకు ఇదే అతి పెద్ద ఓటమి. దీంతో సౌతాఫ్రికాతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ క్లీన్‌స్వీప్ అయ్యింది. అయితే ఈ సిరీస్ ఫలితంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అతడి కోచింగ్ పీరియడ్‌లోనే గతేడాది స్వదేశంలో న్యూజిలాండ్‌పైనా 3-0తో భారత్ క్లీన్‌స్వీప్ అయ్యింది. ఒక కోచ్ పీరియడ్‌లో స్వదేశంలో భారత్ రెండుసార్లు క్లీన్‌స్వీప్ అవ్వడం ఇదే తొలిసారి.దీంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. అతడు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలే వల్లే జట్టుకు ఈ పరిస్థితి అంటూ నెటిజన్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో సౌతాఫ్రికాతో రెండో టెస్టు మ్యాచ్ అనంతరం స్వయంగా గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఇందులో కోచ్‌గా తన భవిష్యత్ ఏంటని మీడియా ప్రశ్నించగా, గంభీర్ సంచలన కామెంట్స్ చేశాడు. నా భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐనే. అంతిమంగా భారత్‌లో క్రికెటే ముఖ్యం. నేను కాదు. ఈ విషయాన్ని నేను కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న రోజే చెప్పాను. ఈరోజు కూడా అదే చెబుతున్నా. అయితే ఇంగ్లాండ్ సిరీస్‌లో అద్భుతమైన ఫలితాలు రాబట్టింది కూడా మేమే అనే విషయాన్ని జనాలు అని మర్చిపోతున్నారు. కానీ అందరూ న్యూజిలాండ్ సిరీస్ గురించే మాట్లాడుతున్నారు'అలా అయితే ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ ట్రోఫీలు కూడా గెలిచింది నా కోచింగ్ పీరియడ్‌లోనే. ఇప్పుడున్న జట్టులో కుర్రాళ్లే ఎక్కువ. వాళ్లకు ఉన్న అనుభవం తక్కువ. కుదురుకోవడానికి వాళ్లకు కాస్త సమయం పడుతుందని నేను ఇదివరకే చెప్పాను. కుర్రాళ్లకు ఇంకా టైమ్ ఇవ్వాలి. అయినా ఓటమిపై అందర్నీ నిందించాలి. ఓటమికి అందరిదీ బాధ్యతే' అని గంభీర్ అన్నాడు.తాజా ఓటమితో భారత్ స్వదేశంలో ఆడిన గత 7 మ్యాచ్‌ల్లో ఐదింట ఓటమిపాలైంది. ఇక గంభీర్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత 19 టెస్టుల్లో 10 మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియా ఓడింది. గతేడాది స్వదేశంలో భారత్, న్యూజిలాండ్‌ను ఢీ కొట్టింది. ఆ సిరీస్‌ను కూడా 3- 0తో కోల్పోయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటలోనూ భారత్ విఫలమైంది. ఆసీస్‌తో ఆడిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీని టీమ్‌ఇండియా 1- 3 కోల్పోయింది. అయితే ఈ ఏడాది యంగ్ ప్లేయర్లతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా మంచి ఫలితం రాబట్టింది. ఐదు మ్యాచ్?ల సిరీస్?ను 2-2తో డ్రా చేసుకుంది.స్వదేశంలో సౌతాఫ్రికాపై వైట్‌వాష్‌కు గురికావడం భారత్‌కు 25ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా సౌతాఫ్రికా 2000 సంవత్సరంలో భారత్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. అంతేకాకుండా ఈ సిరీస్‌లో రెండు టెస్టుల్లోనూ భారత్ నుంచి ఏ ఒక్క బ్యాటర్ కూడా మూడంకెల స్కోర్ అందుకోలేదు. గత 30ఏళ్లలో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా ప్లేయర్లు సెంచరీ చేయకపోవడం ఇదే తొలిసారి.

## సారీ ఫ్యాన్స్.. క్షమించండి

### టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్



భారత క్రికెట్ అభిమానులకు టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ క్షమాపణలు చెప్పాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్టల సిరీస్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయామని, తమను మన్నించాలని కోరాడు. గౌహతి వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే.ఈ విజయంతో రెండు టెస్టల సిరీస్‌ను 2-0తో సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలుపొందింది. వరుసగా రెండో ఏడాది టెస్ట్ సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. దాంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు ఆటగాళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ జట్టును నడిపించాడు. కానీ 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే ఏన్నడు లేని పరాజయాన్ని టీమిండియా చవిచూసింది.ఈ క్రమంలోనే అభిమానులకు క్షమాపణలు చెబుతూ రిషభ్ పంత్ సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పంచుకున్నాడు. 'గత రెండు వారాలుగా మేం సరిగ్గా ఆడలేదనేది నగ్న సత్యం. జట్టుగా.. వ్యక్తిగతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని, కోట్లాది మంది భారతీయుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావాలని కోరుకుంటాం. కానీ ఈ సారి మేం మీ అంచనాలను అందుకోలేకపోయాం. అందుకు మమ్మల్ని క్షమించండి. కానీ క్రీడల్లో ఓటమి ఎప్పుడూ జట్టుగా.. వ్యక్తిగతంగా గుణపాఠం నేర్పుతుంది. మరింత మెరుగవ్వాలని విషయాన్ని సూచిస్తుంది. భారత్ దేశానికి ప్రాతినిథ్యం వహించడం మా జీవితాల్లోనే మాకు దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ జట్టు సామర్థ్యం ఏంటో మాకు తెలుసు. మేం మరింత కష్టపడుతాం. మా ఆటపై మరింత ఫోకస్ పెడ్తాం. వ్యక్తిగతంగా జట్టుగా నేలకు కొట్టిన బంతిలా తిరిగి వస్తాం. మీ అమితమైన మద్దతు, ప్రేమకు ధన్యవాదాలు. జైహింద్'అని పంత్ తన సుదీర్ఘ పోస్ట్‌లో పేర్కొన్నాడు. టెస్ట్ సిరీస్ కోల్పోయిన టీమిండియా.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్దమవుతోంది. నవంబర్ 30న రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌తో కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా, సిరాజ్, శుభ్‌మన్ గిల్‌కు రెస్ట్ ఇచ్చారు. కేఎల్ రాహుల్ భారత జట్టును నడిపించనున్నాడు.

## శ్రీచరణికి కోటి 30 లక్షలు




వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మెగా వేలంలో టీమిండియా స్టార్ స్పిన్నర్, తెలుగు తేజం శ్రీ చరణికి రూ. 1.30 కోట్ల జాక్‌పాట్ ధర దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మెగా వేలంలో ఈ కడప బిడ్డను ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన శ్రీచరణి కోసం యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.30 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకుంది. గత సీజన్‌లోనూ శ్రీ చరణి ఢిల్లీ క్యాపిటల్స్‌కే ఆడింది. రూ. 50 లక్షల భారీ ధరకు ఈ తెలుగు తేజాన్ని ఢిల్లీ కొనుగోలు చేసింది. డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన శ్రీ చరణి.. 4 వికెట్లతో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చింది. ఈ అద్భుత ప్రదర్శనతోనే టీమిండియాకు ఆడే అవకాశం అందుకున్న శ్రీచరణి ఏకంగా.. మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీకి ఎంపికైంది.మెగా టోర్నీలో 21 ఏళ్ల శ్రీ చరణి అదరగొట్టింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అయిన ఈ ఆంధ్రా అమ్మాయి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. ఈ 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ముఖ్యంగా సెమీస్, ఫైనల్లో ఆమె కట్టుదిట్టమైన బౌలింగ్ టీమిండియా విజయానికి బాటలు వేసింది. ఈ టోర్నీలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనే వేలంలో శ్రీ చరణి కోట్లు పలికేలా చేసింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇదే తొలి మెగా ఆక్షన్ కాగా.. మల్లికా సాగర్ ఆక్షనీర్‌గా వ్యవహరిస్తోంది. ఆస్ట్రేలియా క్రికెటర్ అలీసా హీలీతో మెగా వేలం ప్రారంభం కాగా.. ఆమెను తీసుకోవడానికి ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. దాంతో ఆమె తొలి రౌండ్‌లో అన్‌సోల్డ్‌గా నిలిచింది. మరోసారి ఆమె పేరును వేలం వేసే అవకాశం ఉంది. న్యూజిలాండ్ ప్లేయర్ సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేయగా.. కివీస్‌కే చెందిన అమెలియా కేర్‌ను ముంబై ఇండియన్స్ రూ.3 కోట్లకు తీసుకుంది. భారత పేసర్ రేణుకా సింగ్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. ఇంగ్లండ్ ప్లేయర్ సోఫీ ఎక్లిస్టోన్‌ను రూ.85 లక్షలకు యూపీ వారియర్స్ ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా రిటైన్ చేసుకుంది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్ట్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసింది.

## మహిళా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ విడుదల

మహిళా క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. మహిళల క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్న మహిళా ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ షెడ్యూల్‌ను వేలం జరిగిన గురువారం నాడే విడుదల చేశారు. సుమారు నెల రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్ జనవరి 9, 2026న ప్రారంభమై.. ఫిబ్రవరి 5, 2026న ఫైనల్ మ్యాచ్‌తో ముగుస్తుంది. మహిళా క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకుపోయే ఉద్దేశంతో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వేలం జరిగిన రోజే బీసీసీఐ ఈ షెడ్యూల్‌ను కూడా ప్రకటించడం గమనార్హం. గత సీజన్‌లో డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు నాలుగు వేర్వేరు నగరాల్లో జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ సారి నిర్వహణ సౌలభ్యం కోసం మ్యాచ్‌లను కేవలం రెండు ప్రముఖ నగరాల్లో మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు.నవీ ముంబైలోని అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన డి.వై. పాటిల్ స్టేడియం ప్రధాన వేదికల్లో ఒకటిగా నిలవనుంది. క్రికెట్ సంస్కృతికి ప్రసిద్ధి చెందిన వడోదర కూడా మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా, స్థానిక క్రికెట్ అభిమానులకు లీగ్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తుంది.డబ్ల్యూపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి గత మూడు సీజన్లలో టైటిల్ గెలుచుకున్న జట్లు వివరాలు ఇలా ఉన్నాయి.హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ మొదటి టైటిల్‌ను గెలుచుకుంది. లి2024: స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్‌ను కైవసం చేసుకుంది. లి2025: మళ్లీ ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి, తమ రెండో టైటిల్‌ను గెలుచుకుంది. డబ్ల్యూపీఎల్‌లో జట్లు లీగ్ దశలో ఒకదానితో ఒకటి రెండు మ్యాచ్‌లు ఆడతాయి. లీగ్ దశలో మొదటి స్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది.

## అత్యంత ఖరీదైన క్రీడాకారిణిగా దీప్తి శర్మ




మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం మార్కీ ప్లేయర్స్‌తో ప్రారంభమైంది, ఈ కేటగిరీలో మొత్తం 8 మంది క్రీడాకారులు ఉన్నారు. 7 మార్కీ క్రీడాకారులకు వారి జట్లు లభించాయి, అయితే ఈ రౌండ్‌లో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అలీసా హీలీని ఎవరూ కొనలేదు. ఈ రౌండ్‌లో అత్యంత ఖరీదైన క్రీడాకారిణి ఆల్ రౌండర్ దీప్తి శర్మ, యూపీ వారియర్స్ ఆమె కోసం ఆటీఎం ని ఉపయోగించింది. దీప్తి శర్మ తిరిగి యూపీ వారియర్స్‌కు వెళ్లడంపై సంతోషం వ్యక్తం చేస్తూ జియోహాట్‌స్టార్‌లో మాట్లాడుతూ, "చాలా బాగుంది. నేను యూపీకి చెందినదాన్ని, కాబట్టి ఏదో ఒక విధంగా ఈ జట్టుతో నాకు అనుబంధం ఉంది. ఇక్కడి నిర్వహణ చాలా బాగుంది. మహిళల ప్రీమియర్ లీగ్ నా ప్రదర్శనను మెరుగుపరచడానికి చాలా సహాయపడింది." దీప్తి శర్మ మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం జాబితాలో మూడో స్థానంలో ఉంది, ఆమెకు ముందు అలీసా హీలీని ఎవరూ కొనలేదు. హీలీని కొనకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. చాలాసేపు దీప్తిపై కూడా ఏ జట్టు బిడ్ వేయలేదు, చివరకు ఢిల్లీ ఆమెపై ఆమె బేస్ ప్రైస్‌తో బిడ్ వేసింది. ఆ తర్వాత ఏ జట్టు ఆసక్తి చూపించకపోవడంతో ఆమె ఢిల్లీకి అమ్ముడుపోయింది. కానీ యూపీ ఆమెపై ఉపయోగించింది, ఆ తర్వాత ఢిల్లీ తన తుది ధర 3 కోట్ల 20 లక్షల రూపాయలుగా పేర్కొంది. యూపీ ఉపయోగిస్తూ దీప్తిని కొనుగోలు చేసింది. మార్కీ రౌండ్‌లో యూపీ వారియర్స్ ముగ్గురు ఆటగాళ్లను కొనుగోలు చేసింది. దీప్తి శర్మ (3.2 కోట్లు)తోపాటు ఈ రౌండ్‌లో సోఫీ ఎక్లెస్టన్ (85 లక్షలు), మెగ్ లానింగ్ (1.9 కోట్లు)ను కూడా కొనుగోలు చేసింది. ఈ రౌండ్‌లో గుజరాత్ జెయింట్స్ ఇద్ది ఆటగాళ్లను (సోఫీ డివైన్, రేణుకా సింగ్) తమ జట్టులో భాగం చేసుకుంది. ఆశా శోభనను యుపి వారియర్స్ సొంతం చేసుకుంది. ఇతర జట్లు కూడా శోభనపై ఆసక్తిని వ్యక్తం చేయడంతో ఆమె ధర 30 లక్షల రూపాయల నుంచి 1 కోటి రూపాయలకు పెరిగింది. ఆశా బేస్ ధర 30 లక్షల రూపాయలు ఈ వేలంలో ఆమె మునుపటి ఎడిషన్ కంటే 11 రెట్లు ఎక్కువ డబ్బు అందుకుంది. ఆశా శోభన మార్చి 16, 1991న కేరళలోని త్రివేంద్రంలో జన్మించిన ఆల్ రౌండర్. 34 ఏళ్ల ఆమె ఇప్పటివరకు భారతదేశం తరపున రెండు వన్డేలు, ఆరు టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఆమె ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2022/23, 2023/24 ఎడిషన్‌లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడింది. ఆశా శోభన ఇప్పటివరకు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్‌సిబి తరపున 15 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లు పడగొట్టింది. ఆమె బ్యాటింగ్‌తో అంతగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ, ఆమెకు ఆ సామర్థ్యం ఉంది. 2026 ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ వేలంలో ఆశా శోభన దుమ్మురేపింది. గత సంవత్సరం కంటే 11 రెట్లు ఎక్కువ సంపాదించింది. రాబోయే ఎడిషన్ కోసం, ఆమె బేస్ ధర ?30 లక్షలుగా నిర్ణయించింది. ఆమె ధర ?1 కోటికి చేరుకుంది.



## ఎల్లమ్మ సినిమా చేయడం లేదు



సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



### వివాదాలు ఎదురవుతాయని
## ఊహించలేదు

**కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి**

తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి-సోదరి-కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.

## ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్‌లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్‌కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్‌ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్‌పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతిహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్‌లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్. శ్రుతిహాసన్ అందంపై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.



## ఎట్టకేలకు హిట్ కొట్టిన రామ్ పోతినేని

రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆంధ్రకింగ్ తాలూకా.. ఈ సినిమా భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ పి. మహేశ్ బాబు ఈ సినిమాను తెరకెక్కించాడు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాడు. అలాగే రావు రమేష్, మురళీ శర్మ, రాజీవ్ కనకాలు, తులసి, సింధు తులానీ, రాహుల్ రామకృష్ణ, సత్య, వీటీవీ గణేష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇక ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు సినిమా పై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇక సినిమా బాగుందని.. చాలా కాలం తర్వాత రామ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు అంటున్నారు. రామ్ నటన సినిమాకే హైలైట్ అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఎట్టకేలకు రామ్ హిట్ కొట్టాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు ప్రేక్షకులు. మొత్తానికి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్ లోకి వచ్చాడు రామ్ పోతినేని.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131